ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
జయశంకర్ భూపాలపల్లి
బుధవారం 9 జూలై 2025





కేసముద్రం బహిరంగసభలో అభివాదం చేస్తున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు



సోమ్లా తండాలో వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేస్తున్న డిప్యూటీ సీఎం, మంత్రులు

సంక్షేమ పథకాల్లో తెలంగాణ టాప్



- ప్రజా ప్రభుత్వ పాలనలో సంతోషంగా ప్రతీ కుటుంబం
- దేశంలో ప్రజల గురించి ఆలోచించే ఏకైక పార్టీ కాంగ్రెస్
- గత ప్రభుత్వ అప్పులు చెల్లిస్తూనే ఎన్నికల హామీల అమలు
- సీఎం సహా మంత్రులం రోజుకు 18 గంటలు పనిచేస్తున్నాం
- డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క
- మహబూబాబాద్ నియోజకవర్గ పరిధిలో రూ.400 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు
- సోమ్లాతండా, కేసముద్రంలో హోరెత్తిన బహిరంగ సభలు
- డిప్యూటీ సీఎం సహా ఆరుగురు మంత్రుల రాక
- అన్నీ తానై నడిపించిన సీఎం సలహాదారు వేం

మహబూబాబాద్/కేసముద్రం, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : సంక్షేమ పథకాల అమల్లో రాష్ట్రం ప్రథమ స్థానంలో ఉందని, దేశంలోని అన్ని రాష్ట్రాలు తెలంగాణ రైజింగ్ వైపే చూస్తు న్నాయని రాష్ట్ర ఉప ముఖ్య మంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. మహబూబాబాద్ జిల్లా సోమ్లాతండాలో రూ.100 కోట్లు, కేసముద్రం పట్టణంలో రూ.300 కోట్లతో చేపట్టే అభివృద్ధి పనులకు మంగళవారం మంత్రులతో కలిసి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ అధ్యక్షతన ఆయా కేంద్రాల్లో ఏర్పాటు చేసిన సభల్లో డిప్యూటీ సీఎం విక్రమార్క మాట్లాడుతూ.. కాంగ్రెస్ పాలనలో ప్రతీ కుటుంబానికి సంక్షేమ పథకాలు అందడంతో సంతోషంగా ఉన్నాయని చెప్పారు. మహిళలను కోటీశ్వరులుగా చేయాలన్నదే ప్రభుత్వ సంకల్పమని, ఈ నెల 12 నుంచి డ్వాక్రా మహిళలకు వడ్డీ లేని రుణాలను అందించనున్నట్లు చెప్పారు. నిరుద్యోగ యువతకు ఉపాధి కోసం రూ.8 వేల కోట్లతో రాజీవ్ యువ వికాస పథకాన్ని ఉత్సవంలా చేపడుతామని స్పష్టం చేశారు.

ప్రజల గురించి ఆలోచించే ఏకైక పార్టీ

దేశంలో ప్రజల గూర్చి ఆలోచించే ఏకైక పార్టీ కాంగ్రెస్ మాత్రమేనని ఆ పార్టీని ప్రజలు గుండెల్లో పెట్టుకుని కాపాడుకోవాలని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. దేశంలో (మిగతా 6వ పేజీలో...)

హోరెత్తిన కాంగ్రెస్ సభలు

- మంత్రుల ప్రసంగాలతో ఎన్నికల జోష్
- పార్టీ కేడర్‌లోనూతనోత్సాహం
- స్థానిక సమరానికి శంఖారావం
- సోమ్లాతండా, కేసముద్రం సభలకు భారీ జనసమీకరణ

7

మా ప్రభుత్వ పథకాలు చరిత్రాత్మకమైనవి...



- ప్రజల అభిమానంతోనే అధికారంలోకి వచ్చాం
- కేసముద్రం సర్వతోముఖాభివృద్ధికి కృషి
- రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీని ఆశీర్వదించాలి
- సీఎం ప్రధాన సలహాదారు వేం నరేందర్‌రెడ్డి

కేసముద్రం, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : అప్పుల తెలంగాణలో పథకాలు అమలు చే యడం ఆషామాషీ కాదని, చరిత్రలో ఎవ రూ అమలు చేయని విధంగా పథకాలు రూ పొందించి పేదలకు అందిస్తున్నామని ము ఖ్యమంత్రి ప్రధాన సలహాదారుడు వేం నరేందర్ రెడ్డి అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆశీస్సులతో మహబూబాబాద్‌తోపాటు కేసముద్రా న్ని అభివృద్ధి చేసేందుకు శ్రీకారం చుట్టినట్లు (మిగతా 6వ పేజీలో...)





పిట్టలోనిగూడెంలో హత్యకు గురైన కనకయ్య

ప్రాణరక్షణ కోసం సివంగులయ్యారు...

- తమను చంపబోయిన తాగుబోతు భర్తను కడతేర్చిన భార్యలు
- 50 రోజుల కిందటే మొదటి భార్య తల్లిని కడతేర్చి మళ్లీ వచ్చిన కిరాతకుడు
- గొడ్డలితో దాడికి యత్నిస్తుండగా అడ్డుకొని తిరగబడిన భార్యలు
- తలపై గాయాలతో మృతి
- ఇద్దరు భార్యల్లో ఒకరు మైనర్
- జనగామ జిల్లాలో విషాద ఘటన



హత్యకు ఉపయోగించిన గొడ్డలితో పెద్ద భార్య చొక్కమ్మ

లింగాల ఘణపురం, జూలై 8 (ఆంధ్రజ్యోతి): అతడు మద్యానికి బానిసై మానవ మృగంగా తయారయ్యాడు.. వావి వరుసలు లేకుండా అఘాయిత్యాలకు పాల్పడే స్థాయికి దిగజారాడు.. అతడి చూస్తే గూడెం గూడెమంతా భయంతో వణికిపోయేది.. 50రోజుల క్రితం తాగిన మైకంలో మొదటి భార్య తల్లిని పొట్టన పెట్టుకోవడమే కాకుండా, తాజాగా తన ఇద్దరు భార్యల వద్దకు వచ్చి వారిపైనా దాడికి యత్నించాడు. ఆత్మరక్షణ కోసం వారు ప్రతిదాడి చేయగా, ఆ మృగం అక్కడే ప్రాణాలు కోల్పోయింది. ఈ సంఘటన జనగామ జిల్లా లింగాలఘణపురం మం డలం ఏనెబావి శివారు పిట్టలోని గూడెంలో మంగళవారం తెల్లవారుజామున జరిగింది. తాగుబోతు భర్త తీరుతో అమాయకులైన ఇద్దరు మహిళలు జైలు పాలయ్యే పరిస్థితి వచ్చింది. మృతుడి ఇద్దరు భార్యల్లో ఒకరు 16 ఏళ్ల మైనర్ కావడం విషాదం. పోలీసుల కథనం ప్రకారం.. పిట్టలోనిగూడెంకు చెందిన కాలియా కనకయ్య (30)కు శిరీష అలియాస్ చొక్కమ్మ, బాలిక(16) ఇద్దరు భార్యలు. మామిడి తోటలను లీజుకు తీసుకుని కూలి పనులు చేస్తూ సంచార జీవితాన్ని గడుపుతున్నాడు. మే 18న యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం సుద్దాలలో మామిడితోటలో కూలీగా పనిచేస్తున్న తన అత్త (మిగతా 7లో..)

కనకయ్యది విశృంఖల ప్రవర్తన..

కనకయ్య పేరు వింటేనే గ్రామస్థులు వణికిపోయేవారు. సంచారజీవితా న్ని గడుపుతూ నల్లగొండ, సిద్దిపేట, నిజామాబాద్, మెదక్ జిల్లాల్లో మామి డి తోటల లీజు కోసం తిరుగుతుండేవాడు. అతడు గ్రామానికి ఎప్పుడు వచ్చినా బహిర్భూమి కోసం వచ్చే ఒంటరి మహిళలను టార్గెట్ చేసి అత్యాచారానికి పాల్పడేవాడని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికే ఆరుగురిపై అత్యాచారం చేశాడని పేర్కొంటున్నారు. కొడుకు చేష్టలను అడ్డుకునేందుకు కనకయ్య తండ్రి అమితాబచ్చన్ ప్రయత్నించడంతో తండ్రిపై దాడిచేసి కా ళ్లు చేతులు విరగ్గొట్టి పరారైపోయాడు.

పలిమెలకు పెరిగిన ఎంపీటీసీ స్థానాలు

మహదేవపూర్ రూరల్, జూలై 8(ఆంధ్రజ్యోతి) : పలిమెల ఎంపీటీసీ స్థానాలను పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. గతంలో మండల వ్యాప్తంగా పలిమెల, సర్వాయిపేట రెండు మాత్రమే ఎంపీటీసీ స్థానాలు ఉండగా ప్రస్తుతం ఆ సంఖ్య ఐదుకు చేరింది. కొత్తగా లెంకలగడ్డ, పంకెన, దమ్మూర్ ఎంపీటీసీ స్థానాలను ప్రభుత్వం ప్రకటించింది. ప్రతి మండలానికీ కనీసం ఐదుకు తగ్గకుండా ఎంపీటీసీ స్థానాలు ఉండేలా పునర్వ్యవస్థీకరణ చేయాలని కలెక్టర్లను రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ ఆదేశించడంతో ఈమేరకు కొత్త ఎంపీటీసీ స్థానాలను ప్రకటించినట్లు తెలిసింది. భూపాలపల్లి జిల్లాలో మొత్తం 106 ఎంపీటీసీ స్థానాలు ఉండగా పలిమెల మండలంలో పెరిగిన మూడు ఎంపీటీసీ స్థానాలతో మొత్తం 109 స్థానాలకు చేరనుంది.

అస్తవ్యస్తంగా అంగన్‌వాడీలు

- అరకొర వసతులతో అవస్థలు
- ములుగు జిల్లాలో 640 కేంద్రాలు... సొంత భవనాలు ఉన్నవి 276 మాత్రమే
- పనిచేయాల్సిన టీచర్లు 640 మంది... పని చేస్తుంది 544 మంది

8

ఆర్‌ఎంపీల క్లినిక్‌లపై వైద్య శాఖ దాడులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



భూపాలపల్లి పట్టణంలో ఆర్‌ఎంపీ క్లినిక్‌ను తనిఖీలు చేస్తున్న ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో శ్రీదేవి

భూపాలపల్లి కలెక్టరేట్, జూలై 8(ఆంధ్రజ్యోతి): ఆర్‌ఎంపీల క్లినిక్‌లపై వైద్య ఆరోగ్య శాఖ అధికారులు మంగళవారం దాడులు నిర్వహించారు. జిల్లాలో కొందరు ఆర్‌ఎంపీలు అక్రమంగా వైద్యం చేస్తున్నారని 'ఆంధ్రజ్యోతి'లో ఈనెల 8న ప్రచురితమైన కథనంపై స్పందించారు. భూపాలపల్లి పట్టణంలోని పలు ఆర్‌ఎంపీల క్లినిక్‌లపై వైద్య ఆరోగ్య శాఖ ఇన్‌చార్జి అధికారి (డీఎంహెచ్‌వో) డాక్టర్ శ్రీదేవి నేతృత్వంలో తనిఖీలు నిర్వహించి నోటీసులు జారీ చేశారు. ఇదే క్రమంలో భూపాలపల్లి పట్టణం కృష్ణకాలనీలోని పీహెచ్‌సీ ఎదురుగా ఓ ఆర్‌ఎంపీ నిబంధనలు ఉల్లఘించి వైద్యం చేస్తుండటం అధికారుల దృష్టికి వచ్చింది. సెలెన్స్‌తోపాటు ఇంజెక్షన్లను ఇస్తుండడాన్ని గుర్తించారు. దీంతో పాటు పలువురు ఆర్‌ఎంపీలు మెడికల్ షాపుల్లో తమ ప్రాక్టీస్ చేస్తున్నట్లు గుర్తించిన అధికారులు నోటీసులు జారీచేశారు. ఆర్‌ఎంపీల క్లినిక్‌లపై తనిఖీలు చేసిన బృందంలో పీహెచ్‌సీ మెడికల్ అధికారి రోహిణి, ఏఎన్‌ఎంలు తదితరులు ఉన్నారు.

అభివృద్ధిని చూడలేక కండ్లలో నిప్పులు

- 70 ఏండ్లలో కోయజాతికి అవకాశం వస్తే తట్టుకోలేక పోతున్నారు
- నన్ను ఓడించేందుకు వందల కోట్లు ఖర్చు చేశారు
- ములుగును అభివృద్ధి చేస్తుంటే అడ్డుకునేందుకు ప్రయత్నాలా?
- కేటీఆర్.. ఇప్పటికే నీ చెల్లి నీపై దుమ్మెత్తి పోస్తోంది..
- నాతో పెట్టుకుంటే నాశనమైపోతావ్
- నీకు కుల బలం, ధనబలముంటే నాకు ప్రజల ఆశీర్వాదముంది
- విలేకరుల సమావేశంలో మంత్రి సీతక్క



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

వివరాలు 7వ పేజీలో

చెరువులోపడి ఒకరి మృతి

మల్హర్, జూలై 8(ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొయ్యూర్‌లో చెరువులో పడి ఓవ్యక్తి మృతి చెందిన ఘటన మంగళవారం చోటు చేసుకుంది. కొయ్యూర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కొయ్యూర్ గ్రామానికి చెందిన స్వామి(38) గ్రామంలో తాపీమేస్త్రీ పని చేస్తు జీవనం సాగిస్తున్నాడు. సోమవారం సాయంత్రం గ్రామంలోని చెరువు వద్దకు బహిర్భుమికి వెళ్లి ప్రమాదవ శాత్తు చెరువులో పడి మృతి చెందినట్లు వారు తెలిపారు. మృతుడి భార్య పుష్ప ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతునికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

సార్వత్రిక సమ్మె సైరన్!

- నేడు కార్మికుల హర్తాళ్
- సింగరేణి కార్మికులు పాల్గొన వద్దంటూ యాజమాన్యం పిలుపు



సమ్మెలో పాల్గొనాలని కేటీకే-1వ గని వద్ద కార్మికులను కోరుతున్న జేఏసీ నాయకులు (ఫైల్)

కృష్ణకాలనీ, జూలై 8 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందని నిరసిస్తూ కార్మిక సంఘాలు సమ్మెకు సిద్ధమయ్యాయి. బుధవారం ఒక్క రోజు సమ్మెకు దిగుతున్నారు. దీన్ని అన్ని వర్గాల కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలంటూ కార్మిక జేఏసీ నేతలు విస్తృత ప్రచారం చేశారు. సింగరేణి గనుల వద్ద కూడా కార్మికులను కలిసి విజ్ఞప్తి చేశారు. అయితే.. ఈ సమ్మెలో పాల్గొనవద్దని సంగరేణి యాజ మాన్యం కార్మికులను కోరుతోంది. ఈ సమ్మెతో సింగరేణి సంస్థకు సంబంధం లేదని అంటోంది. ఒక్క రోజు సమ్మె అయినా సింగరేణికి అపార నష్టం వాటిల్లుతుందని పేర్కొంది.

సమ్మెతో రూ. 76 కోట్ల నష్టం

సింగరేణి కార్మికులు సమ్మెలో పాల్గొంటే సంస్థకు భారీగానే నష్టం ఏర్పడనుంది. ఈ మేరకు సింగరేణి కంపెనీని నష్టం అంచనాను సైతం ప్రకటించింది. ఒక్క రోజు సంస్థలోని సింగరేణి కార్మికులు విధులకు హాజరుకాకుంటే కంపెనీకి సుమారు రూ. 76 కోట్ల నష్టం వాటిల్లుతుందని, సుమారు రూ.13.07 కోట్ల కార్మికులు వేతనాల్ని నష్టపోవాల్సి వస్తుందని పేర్కొంది. సంస్థకు మొత్తంగా 1.92 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తికి విఘాదం ఏర్పడుతుందని సింగరేణి అధికారులు భావిస్తున్నారు. మరోవైపు వర్షాల దృష్ట్యా ఈ నెల జూలై, ఆగస్టు నెలల్లో సైతం బొగ్గు ఉత్పత్తికి ఆటంకం ఏర్పడి సంస్థ నష్టాల పాలై ఆస్కారం ఉందని అధికారులు అంటున్నారు.

బీఎంఎస్ మినహా అన్ని సంఘాల సంఘీభావం

దేశ వ్యాప్తంగా జరిగే సమ్మెకు ఒక్క సింగరేణి విభాగంలోని ఒక్క బీజేపీ అనుబంధ బీఎంఎస్ మినహా మిగి లిన సంఘాలు ఐఎన్‌టీయూసీ, ఏఐటీయూసీ, టీబీజీకే ఎస్, సీఐటీయూ, హెచ్‌ఎంఎస్, ఐఎఫ్‌టీయూ సంఘీభా వం ప్రకటించాయి. ఈ సంఘాల నాయకులంతా ఏకమై జేఏసీగా సైతం ఏర్పడి సమ్మెపై విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. అయితే.. తొలుత ఈ సమ్మె మే 20న నిర్వహించేందుకు తలపెట్టగా పహల్గాంలో ఉగ్రవాదుల దృష్ట్యా జూలై 9కి వాయిదా పడింది.

కార్మిక చట్టాల రద్దుతో కన్నెర్ర

కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం 29 కార్మిక చట్టాలను రద్దు చేసింది. వాటి స్థానంలో నాలుగు లేబర్ కోడ్స్‌ను తెచ్చింది. దీంతో అన్ని వర్గాల కార్మికులకు ఉన్న హక్కులను కోల్పోవాల్సి వస్తోందని కార్మిక సంఘాలు గుర్తించాయి.

కార్మిక వ్యతిరేక విధానాల్ని బీజేపీ అవలంబిస్తోందని ఆరోపిస్తూ దేశ వ్యాప్తంగా ఉన్న సంఘాలన్నీ ఏకమై సమ్మెకు పిలుపునిచ్చాయి. ప్రధానంగా లేబర్ కోడ్స్‌ను రద్దు చేయడంతో పాటు పాటు కార్మికులకు వెన్నుదన్నుగా ఉండే 18 రకాల డిమాండ్లను యథావిధంగా కొనసాగించాలనే ఉద్దేశంతో సమ్మె చేపట్టనున్నాయి.

ముంపు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ములుగు కలెక్టర్ దివాకర



ఎక్కెలలో ప్రభుత్వభూమికి సంబంధించిన వివరాలు అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ దివాకర

ఏటూరునాగారం రూరల్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలం దృష్ట్యా గోదావరి ముంపు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ములుగు కలెక్టర్ టీఎస్.దివాకర సూచించారు. మండలంలోని ఎక్కెల, భూటారం, చిన్నబోయి నపల్లి గ్రామాల్లో ఆయన మంగళవారం పర్యటించారు. భూటారం గ్రామస్థులకు గోదావరి ముంపు వల్ల ప్రమాదం ఉందని, వారి కోసం నివాస స్థలాలు కేటాయించేందుకు స్థల పరిశీలన కోసం ఎక్కెలలోని ప్రభుత్వ భూమిని అదనపు కలెక్టర్ మహేందర్‌జీతో కలిసి కలెక్టర్ పరిశీలించారు. ప్రభుత్వభూమికి సంబంధించిన పూర్తి వివరాలను త్వరితగతిన అందజేయాలని తహసీల్దార్ జగదీశ్వర్‌ను ఆదేశించారు. అనంతరం మండల కేంద్రంలోని అటవీ శాఖ అతిథిగృహం సమీపంలో నర్సరీని పరిశీలించారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేయనున్న కూరగాయల మార్కెట్ ఏర్పాటుకు స్థల పరిశీలన చేసి వివరాలు అందించాలని సూచించారు. అనంతరం చిన్నబోయినపల్లిలోని సర్వేనంబర్ 98 పోడు భూమికి ఆర్‌వోఆర్ పట్టాలివ్వడానికి అవకాశం లేదని, అటవీ సంరక్షణ సమితి ద్వారా చేపడుతున్న మొక్కల పెంపకానికి సంబంధిత రైతులు సహకరించాలని కలెక్టర్ సూచించారు.

మహిళలు స్వావలంబన సాధించాలి

జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి బాలకృష్ణ



కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఆర్‌డీవో బాలకృష్ణ

కాటారం, జూలై 8(ఆంధ్రజ్యోతి): 'స్వశక్తి' మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి బాలకృష్ణ అన్నారు. మండల కేంద్రంలోని జీవనజ్యోతి మండల సమాఖ్య కార్యాలయంలో స్వశక్తి సంఘాల మహిళలకు ప్రభుత్వం వడ్డీ లేని రుణాల డబ్బులు జమ చేయడంపై మంగళవారం ఇందిరా మహిళాశక్తి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు స్వశక్తి మహిళలు సెర్ప్ ద్వారా తీసుకున్న రుణాల డబ్బులతో తాము ఎంచుకున్న రంగాలు, ఉపాధి అవకాశాలు, అందులోని సాదకబాదకాలు, ఎదుగుతున్న తీరును వివరించారు. ఈ సందర్భంగా డీఆర్‌డీవో బాలకృష్ణ మాట్లాడుతూ రాష్ట్ర గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) ద్వారా వివిధ పథకాల కింద అందిస్తున్న ఉపాధి అవకాశాలను స్వశక్తి సంఘాల మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మ కంగా ఎంఎస్‌ఎంఈ (సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు) రంగంలో మహిళలకు పరిశ్రమల నిర్వాహణ, ఉత్పత్తుల మార్కెటింగ్ మెలకువలు, నైపుణ్యాభివృద్ధిపై శిక్షణ అందించి అనంతరం బ్యాంకుల ద్వారా రుణ సహాయం కల్పించి పారిశ్రామికవే త్తలుగా ఎదిగేలా కార్యక్రమాలు చేపడుతున్నట్టు తెలిపారు. ప్రభుత్వం కల్పిస్తున్న ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకొని మహిళా సాధికారత దిశగా సాగాలన్నారు. ప్రభుత్వం మహిళలకు ఇందిరా మహిళాశక్తి కార్యక్రమం ద్వారా అన్ని రంగాల్లో ప్రోత్సాహాన్ని అందిస్తోందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం లవకుమార్, మండల సమాఖ్య అధ్యక్షురాలు ఫర్జానా బేగం, సీసీలు రతన్‌సింగ్, లక్ష్మణ్, విజిత, స్వర్ణలత, లక్ష్మి, అకౌంటెంట్ స్వప్న, మండల సమాఖ్య ప్రధాన కార్యదర్శి బందెల కళ, వీవోఏలు, ఈసీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

'చిన్న కాళేశ్వరం' పైప్‌లైన్ పనులకు

లైన్‌క్లియర్

కాటారం, జూలై 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్న కాళేశ్వరం స్టేజ్-2 పంప్ హౌస్ నుంచి ఆదివారంపేటకు వెళ్లే ప్రధాన పైప్‌లైన్‌కు అడ్డంకులు తొలగిపోయాయి. సబ్ కలెక్టర్ మయాంక్‌సింగ్, కాటారం డీఎస్పీ సూర్యనారాయణ క్షేత్రస్థాయిలో మంగళవారం పర్యటిం చారు. కాటారం రెవెన్యూ శివారులోని 501, 418 సర్వేనెం బర్ల పరిధిలో పైప్‌లైన్ నిర్మాణం జరిగే ప్రదేశాన్ని పరిశీలించారు. అధికారులు భూనిర్వాసిత రైతులతో మాట్లాడారు. నష్టపరిహారం విషయమై ఫైళ్లను పరిశీలించి ఇంకా పరిహారం అందనివారికి వచ్చేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ నేపథ్యంలో రైతులు పనులకు అడ్డంకులు కలిగించబోమని తెలిపారు. దీంతో 130మీటర్ల మేర వేయాల్సిన పైప్‌లైన్ పనులకు మార్గం సుగమమైందని ఇరిగేషన్ అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాటారం సీఐ నాగార్జునరావు, తహసీల్దార్ నాగరాజు, ఎస్సై శ్రీనివాస్, ఐబీ డీఈఈ ఉపేందర్, ఏఈ వెంకన్న తదితరులు పాల్గొన్నారు.



పోలీస్ పహారా నడుమ కొనసాగుతున్న కెనాల్ సర్వే

'చిన్న కాళేశ్వరం' కెనాల్ సర్వేను అడ్డుకున్న రైతులు

మహదేవపూర్, జూలై 8(ఆంధ్రజ్యోతి) : చిన్నకాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ శివారులోని కొత్త చెరువు నుంచి పంట పొలాలు, చేలకు వెళ్లే కెనాల్, సబ్‌కెనాల్ సర్వేను పలువురు రైతులు మంగళవారం అడ్డుకున్నారు. ఈకెనాల్‌తో తమకు ఉపయోగం లేదని చెబుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని మహదేవపూర్‌కు చెందిన ఆగ్రహం వ్యక్తం చేశారు. తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్, ఇరిగేషన్ ఏఈలు సర్దిచెప్పే ప్రయత్నం చేసినప్పటికీ రైతులు వెనక్కి తగ్గలేదు. దీంతో పోలీసు పహారా నడుమ అధికారులు సర్వేను కొనసాగించారు. కెనాల్ హద్దులను గుర్తించి ఎర్రజెండాలు పాతారు. ఇటీవల పలువురు రైతులు మంత్రి శ్రీధర్‌బాబును కలిసి కాల్వ నిర్మాణం చేపట్టొద్దని విన్నవించారు. అయినప్పటికీ సర్వే పనులు కొనసాగుతుండటం పట్ల రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అనుమానాస్పద స్థితిలో బాలుడి మృతి

ఆర్‌ఎంపీ వైద్యం వికటించిందని ఫిర్యాదు



చరణ్‌సింగ్(ఫైల్)

ఇనుగుర్తి, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ఇనుగుర్తి మండలం కోమటిపల్లి తారా సింగ్‌తండా జీపీ పరిధిలోని బావోజితండాకు చెందిన ధరావత్ చరణ్‌సింగ్(14) అనుమానాస్పద స్థితిలో మంగళవారం తెల్లవారుజామున మహబూబాబాద్ జిల్లా ఆస్పత్రిలో మృతి చెందినట్లు ఎస్‌ఐ-2 జి.కరుణాకర్ తెలిపారు. తండాకు చెందిన బాలాజీ, అనిత దంపతులకు ఇద్దరు కుమా రులు కాగా పెద్ద కుమా రుడైన చరణ్‌సింగ్ మహబూబాబాద్ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్నాడు. గత ఆరు రోజులుగా చరణ్‌సింగ్ కడుపునొప్పితో బాధపడుతుండడంతో హాస్టల్ నుంచి ఇంటికి తీసుకువచ్చారు. సోమవారం రాత్రి తీవ్రంగా కడుపునొప్పి రావడంతో కల్వలలోని ఆర్‌ఎంపీ వైద్యుని వద్దకు తీసుకువెళ్లగా ఆయన ఇంజక్షన్లు వేయడంతో ఇంటికి తీసుకు వచ్చారు. మంగళవారం తెల్లవారుజామున మళ్లీ కడుపునొప్పి రావడంతో 108లో జిల్లా ఆస్పత్రికి తరలించగా చికిత్సపొందుతూ బాలుడు మృతి చెందినట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నామని, మృతికి సరైన కారణాలు తదుపరి విచారణలో వెల్లడవుతాయని ఎస్‌ఐ వివరించారు.

ర్యాగింగ్, డ్రగ్స్‌పై అవగాహన



న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న జడ్జి విక్రమ్

జనగామ కల్చరల్, జూలై 8(ఆంధ్రజ్యోతి): జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ర్యాగింగ్, డ్రగ్స్‌పై అవగాహన నిర్వహించారు. మంగళవారం జనగామ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సీనియర్ సివిల్ జడ్జి సి.విక్రమ్ నేతృత్వంలో న్యాయ విజ్ఞాన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా విక్రమ్ మాట్లాడుతూ ర్యాగింగ్ చట్ట ప్రకారం నేరమని, అందుకు శిక్ష అనుభవించాల్సి వస్తుందన్నారు. ర్యాగింగ్‌కు గురవుతున్న వారు సంబంధిత లెక్చరర్స్‌కు గానీ, పోలీసులకు గానీ, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ దృష్టికి గానీ తెస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం డ్రగ్స్ గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు వి.శేఖర్, అఫ్జల్, పి.జితేంద్ర, బి.శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిని అడ్డుకుంటే సహించేది లేదు

- ఇళ్లులేని ప్రతీ ఒక్కరికి ఇల్లు ఇవ్వాల్సిందే..
- చేతివాటం ప్రదర్శిస్తే చర్యలు తప్పవు
- పంచాయతీరాజ్ శాఖ, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క



కొత్తగూడలో అధికారితో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

కొత్తగూడ, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : అధికారులు అభివృద్ధిని అడ్డుకుంటే సహించేది లేదని, ఇల్లు లేని ప్రతీ ఒక్కరికి ఇళ్లు ఇవ్వాల్సిందేనని, ఇచ్చే క్రమంలో అధికారులు చేతివాటం ప్రదర్శిస్తే చర్యలు తప్పవని పంచాయతీరాజ్ శాఖ, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క హెచ్చరించారు. ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తి చేస్తే మరిన్ని తీసు కువచ్చేందుకు కృషి చేస్తానని సీతక్క పేర్కొన్నారు. కొత్తగూడ మండల కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మంత్రి సీతక్క మాట్లాడుతూ పదేళ్లలో ఏజెన్సీలో ఒక్క ఇల్లు రాలేదని పేర్కొన్నారు. ఇళ్ల కోసం సుమారు 60వేల నుంచి 70వేల దరఖాస్తులు వచ్చాయని అందరికి ఒకేసారి ఇవ్వలేమని, విడతల వారీగా ఇస్తున్నా మన్నారు. నేడు ఇళ్లను మంజూరు చేస్తే అధికారులు, కార్యదర్శులు లబ్ధిదారులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. ఏజెన్సీ, నాన్ ఏజెన్సీ పేరుతో అధికారులు, కార్యదర్శులు కొర్రీలు పెట్టవద్దని సూచించారు. ఎస్టీ కోటాలో వచ్చిన ఇళ్లను ఎస్టీ వారికి, జనరల్ కోటాలో వచ్చిన ఇళ్లను జనరల్ వాళ్లకు ఇవ్వాలని సూచించారు. ఇళ్లు కట్టుకోని వారికి మహిళా సంఘాల నుంచి ఆర్థికంగా సహాయం చేస్తున్నామని పేర్కొన్నారు. పాత భూములలో సాగు చేసుకుంటుంటే రైతులను ఇబ్బందులకు గురిచేయవద్దని అటవీ శాఖ అధికారులకు సూచించారు. కొత్తపోడు కొట్టకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పంచాయతీ రాజ్ శాఖ రోడ్లను త్వరగా పూర్తిచేయాలని సూచించారు.

నాడు వైఎస్సార్, నేడు రేవంత్..

ప్రజా సంక్షేమం కోసం ప్రత్యేక సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టింది నాడు వైఎస్సార్, నేడు రేవంత్‌రెడ్డి అని పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క పేర్కొన్నారు. వారు ప్రవేశపెట్టిన పథకాలు ఆదర్శనీయమని మంత్రి పేర్కొన్నారు. కొత్తగూడలో నిర్వహించిన మాజీ సీఎం వైఎస్సార్ జయంతి కార్యక్రమంలో ఆమె పాల్గొని వైఎస్సార్ చిత్ర పటానికి పూల మాలవేసి నివాళులు అర్పించారు. ఈసందర్భంగా సీతక్క మాట్లాడుతూ నాడు పేదలు ఇళ్లు ఇచ్చింది వైఎస్సార్ నేడు ఇళ్లు ఇస్తుంది రేవంత్‌రెడ్డి అని పేర్కొన్నారు.

ఆత్మహత్యలను ప్రేరేపిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

గత పదేళ్లుగా ప్రజలను పట్టించుకోకుండా, పథకాలు అమలు చేయకుండా జాప్యం చేసిన బీఆర్ఎస్ ప్రభుత్వం నేడు ఆత్మహత్యలను ప్రేరేపిస్తుందని మంత్రి సీతక్క ఆరోపించారు. ఇందిరమ్మ ఇళ్లు రాలేదని చల్వాయిలో రమేష్ మృతి చెందలేదని గ్రామంలో వాట్సాప్ గ్రూప్‌లో జరిగిన వ్యక్తిగత కారణాలతో మృతిచెందాడని పేర్కొన్నారు. రమేష్ మృతిపై విచారణ చేయిస్తున్నామని పేర్కొన్నారు. బీఆర్ఎస్ నాయకులు విచారణకు డిమాండ్ చేయకుండా రాజకీయం చేస్తున్నారని విమర్శించారు. నాడు ఆత్మహత్య చేసుకున్న నాగయ్య భార్యకు ప్రతిపక్ష ఎమ్మెల్యేగా ఉన్నప్పుడే అంగన్‌వాడీ జాబ్ ఇప్పించానని పేర్కొన్నారు. నాగయ్య మృతి చెందాక కూడా ఆర్థిక సహాయం చేశానని పేర్కొన్నారు. కానీ బీఆర్ఎస్ నాయకులు అటువైపు కన్నెత్తి చూడలేదని ఆరోపించారు.

కాగా కొత్త గూడలో కాంగ్రెస్ పార్టీ యువజన నాయకుడు కిరణ్ తండ్రి యుగేందర్ ఇటీవల మృతిచెందగా మంత్రి సీతక్క కిరణ్ కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వజ్జ సారయ్య, టీపీ సీసీ సభ్యుడు చల్లా నారాయణరెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సుంకర బోయిన మొగిలి, డీసీసీ జనరల్ సెక్రటరీ బానోత్ రూప్‌సింగ్, మాజీ ఎంపీపీలు బానోత్ విజయ రూప్‌సింగ్, సువర్ణపాక సరోజన జగ్గారావు, మాజీ జడ్పీటీసీలు పుల్సం పుష్పలత, ఈసం రమ, డీసీసీ సభ్యుడు వీరనేని వెంకటేశ్వరరావు, మండల ప్రధాన కార్యదర్శి బిట్ల శ్రీనివాస్, మండల అధికార ప్రతినిధి ఇర్ప రాజేశ్వర్, మాజీ సర్పంచ్‌లు మల్లెల రణధీర్, వజ్జ వెంకటలక్ష్మి, ఏఎంసీ డైరెక్టర్ బొల్లు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రమేష్ మృతికి కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలి

- బీఆర్ఎస్ ములుగు నియోజకవర్గ ఇన్‌చార్జి నాగజ్యోతి

గోవిందరావుపేట, జూలై 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చల్వాయి గ్రామంలో ఇటీవల ఆత్మహత్య చేసుకున్న చుక్క రమేష్ మృతికి కారణమైన కాంగ్రెస్ నాయకులపై చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ ములుగు నియోజకవర్గ ఇన్‌చార్జి బడే నాగజ్యోతి డిమాండ్ చేశారు. ఈసందర్భంగా మంగళవారం ఆమె రమేష్ అమ్మమ్మ విశాలను పరామర్శించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల ఎంపికలో అక్రమాలు జరిగాయని రమేష్ వాట్సాప్ గ్రూపులో కాంగ్రెస్ నాయకులను ప్రశ్నించాడని, దీంతో వారు భయభ్రాంతులకు గురిచేయడంతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని ఆరోపించారు. రమేష్ కుటుంబానికి బీఆర్ఎస్ ఎప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు లకావత్ నర్సింహనాయక్, నాయకులు తుమ్మ మల్లారెడ్డి, ఇరుప విజయ, నాంపూర్ణచందర్, సంజీవ, శ్రీనివాస్, రాజు, కృష్ణారెడ్డి, గూడూరు శ్రీనివాసరావు, మధు, తదితరులు పాల్గొన్నారు.



రమేష్ అమ్మమ్మను పరామర్శిస్తున్న నాగజ్యోతి

సంక్షేమ పాలనే కాంగ్రెస్ ధ్యేయం

ఎంపీ కడియం కావ్య



జఫర్‌గడ్‌లో కల్యాణలక్ష్మి లబ్ధిదారులతో ఎంపీ, ఎమ్మెల్యే

జఫర్‌గడ్, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం పనిచేస్తోందని వరంగల్ ఎంపీ కడియం కావ్య అన్నారు. మంగళవారం జఫర్ గడ్ మండల పరిషత్ కార్యాలయంలో లబ్ధిదా రులకు కల్యాణలక్ష్మీ, సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే కడియం శ్రీహరితో కలిసి ఆమె పంపిణీ చేశారు. ఎంపీ కావ్య మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల పంపిణీ కార్యక్రమం దశల వారీగా కొనసాగుతుం దన్నారు. అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు అందుతాయని స్పష్టం చేశారు. ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి వివిధ సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. విపక్షాల దుష్ప్రచారాన్ని ప్రజలు నమ్మవద్దన్నారు. సమావేశంలో సొసైటీ చైర్మన్ టి.కరుణాకర్‌రావు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నూకల అయిలయ్య, ఎంపీడీఓ సుమన్, తహసిల్దార్ శంకరయ్య, మార్కెట్ డైరెక్టర్లు, తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఎంపీ కావ్య, ఎమ్మెల్యే శ్రీహరి జఫర్‌గడ్ ప్రభుత్వ సామాజిక ఆస్పత్రిని సందర్శించారు. ఎక్స్‌రే విభాగంలో ఉద్యోగి నియామకానికి కలెక్టర్‌తో మాట్లాడి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఆస్పత్రిలో సాధారణ ప్రసవాల సంఖ్య పెంచేలా చైతన్యవంతం చేయాలన్నారు.

ఫోర్జరీ డాక్యుమెంట్లతో చర్చి భూముల రిజిస్ట్రేషన్

మంత్రి పొంగులేటికి ఫిర్యాదు చేసిన చర్చి బిషప్ పద్మారావు

డోర్నకల్, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : డోర్నకల్ సీఎస్ఐ అధ్యక్షపీఠం పరిధిలోని భూములను కొందరు వ్యక్తులు తన సంతకాన్ని ఫోర్జరీ చేసి నిరంభ్యతరపత్రం సృష్టించి అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని డోర్నకల్ సీఎస్ఐ బిషప్ కోడిరెక్క పద్మారావు అన్నారు. మంగళవారం డోర్నకల్ బిషప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలంలోని మాదిరిపురం, మహమ్మదాపురం రెవెన్యూ పరిధిలోని భూములను 1903 సంవత్సరంలో లార్డ్ బిషప్ పేరిట అప్పటి నిజాం రిజిస్ట్రేషన్ చేయించారని చెప్పారు. అట్టి భూమిలో సర్వే నెంబర్ 141,142,143లోని నాలుగు ఎకరాలను తన పేరుతో నకిలీ నిరంభ్యంతర పత్రాలు సృష్టించి మరిపెడ మండలానికి చెందిన కొందరు వ్యక్తులు అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని ఆరోపించారు. ఈ విషయం రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి మంగళవారం ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. ఈ విషయంపై ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం పోలీస్‌స్టేషన్‌లో సదరు వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేసినట్లు బిషప్ పద్మారావు తెలిపారు. కొందరు వ్యక్తులు తనను, కరీంనగర్ బిషప్ మార్క్ రూబెన్‌ను ఈ విషయంలో అప్రతిష్టపాలు చేయడానికి ప్రయత్నిస్తున్నారని చెప్పారు.



విలేకరుల సమావేశంలో నకిలీ నిరంభ్యంతర పత్రాన్ని చూపుతున్న బిషప్ కోడిరెక్క పద్మారావు

జనగామ డీసీపీకి ఉత్కృష్ట సేవా పతకం

- విశిష్ట సేవలకు గుర్తింపు



రాజమహేంద్ర నాయక్

జనగామ, జూలై 8 (ఆంధ్ర జ్యోతి): వరంగల్ కమిష నరేట్ పరిధిలోని వెస్ట్‌జోన్(జనగామ) డీసీపీ బి. రాజ మహేంద్రనా యక్‌ను కేంద్ర ప్రభుత్వ ఉత్కృష్ట సేవా పతకం వరించింది. 2025 సంవత్సరానికి గానూ వరంగల్ కమిషనరేట్ పరిధిలో పనిచేసే పలువురు పోలీసు అధికారులు, సిబ్బందిని ఈ అవార్డుకు ఎంపిక చేశారు. 15ఏళ్లలో వివిధ స్థాయిల్లో వారు అందించిన సేవలకు ఉత్కృష్ట సేవా పతకం-2025కు కేంద్రం ఎంపిక చేసింది. ఇందులో భాగంగా రాజమహేంద్రనాయ క్‌ను ఈ పుర స్కారం వరించింది. 2010 గ్రూప్-1 బ్యాచ్‌కు చెందిన ఆయన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని నెల్లూరు జిల్లా ఆత్మకూరు డీఎస్పీగా 2011లో మొదటి పోస్టింగ్ పొందారు. అక్కడి నుంచి 2013లో ఉమ్మడి వరంగల్ జిల్లా సీసీఎస్ విభాగంలో డీఎస్పీగా పనిచేశారు. ఆ తర్వాత ములుగు, మహబూబాబాద్ డీఎస్పీగా విధులు నిర్వర్తించారు. 2017లో పదోన్నతి అదనపు ఎస్పీగా పదోన్నతిపై భూపాల పల్లిలో పనిచేశారు. అనంతరం 2021లో ఎస్పీగా పదోన్నతి పొంది కరీంనగర్ ఇంటెలి జెన్స్ ఎస్పీగా పనిచేశారు. 2024 జూన్ 19న జనగామ డీసీపీగా బాధ్యతలు నిర్వర్తించారు. ఉత్కృష్ట సేవా పథ కానికి ఎంపిక కావడంపై వెస్ట్‌జోన్ పరిధిలోని ఏసీపీలు, సీఐలు, ఎస్సైలు, పోలీస్ సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

మేడారం మాస్టర్ ప్లాన్‌పై సమీక్ష

అభివృద్ధికి సహకరించండని పూజారులను కోరిన కలెక్టర్



మాస్టర్‌ప్లాన్‌పై పూజారులతో మాట్లాడుతున్న కలెక్టర్ దివాకర

తాడ్వాయి, జూలై 8(ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారం దేవస్థానం మాస్టర్‌ప్లాన్‌పై అధికారులు, పూజారులతో కలెక్టర్ దివాకర మంగళవారం సమావేశమయ్యారు. ట్రైబల్ మ్యూజియం క్యూరేటర్ సత్యనారాయణతో కలిసి సమీక్షించారు. మేడారం దేవస్థానం కార్యనిర్వాహక అధికారి వీర స్వామి ఆధ్వర్యంలో సమ్మక్క- సారలమ్మ గద్దెల సమీపంలోని ఐటీడీఏ అతిథి గృహంలోని సమావేశం గదిలో ఈ సమావేశం జరిగింది. మేడారం మాస్టర్ ప్లాన్ పూజారుల కమిటీ ఆధ్వర్యంలో జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. అభి వృద్ధికి అందరూ సహకరించాలని కోరారు. మహా జాతరల సమయంలో కోటికి పైగా భక్తులు వస్తున్నారని అన్నారు. రాబోయే రోజుల్లో భక్తులు పెరిగే అవకా శాలు అధికంగా ఉన్నాయని అన్నారు. అందుకు అనుగుణంగా మేడారంలో సౌకర్యాలు అవసరమని అన్నారు. ఆదివాసీ సంస్కృతికి విరుద్ధంగా ఎలాంటి అభి వృద్ధి పనులు జరగవని హామీ ఇచ్చారు. అయితే భూ సేకరణ, మేడారం అభి వృద్ధి పనులపై పూజారులు, అధికారులతో చర్చించారు. మేడారం అభివృద్ధిపై తిరిగి ఈ నెల 11న సమావేశం ఏర్పాటు చేసుకొని పూజారుల కమిటీ ఏర్పాటు చేసుకుందామని తెలిపారు. ఈ సమావేశంలో ఐటీడీఏ ఏపీవో వసంతరావు, పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్దబోయిన జగ్గారావు, ఉపాధ్యక్షుడు కాక సార య్య, దేవాదాయ, రెవెన్యూ శాఖల అధికారులు, పూజారులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల్లో తెలంగాణ టాప్

(5వ పేజీ తరువాయి)

ఎక్కడా లేని విధంగా తెలంగాణలో పేదల సంక్షేమమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం అనేక పథకాలను ప్రవేశపెడుతుందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు యావత్ క్యాబినెట్ మంత్రులు రోజుకు 18 గంటలు పనిచేస్తూ ప్రజా అభ్యున్నతికి కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలో 1.12 కోట్ల కుటుంబాలు ఉండగా అందులో 90 లక్షలకు పైగా కుటుంబాలకు కాంగ్రెస్ సర్కార్ సంక్షేమ ఫలాలు అందాయని తెలిపారు. రైతు భరోసా, రుణమాఫీ, ఉచిత విద్యుత్, మహిళలకు ఆర్టీసీ ఉచిత బస్సు ప్రయాణం, ఇందిరమ్మ ఇళ్లు తదితర సంక్షేమ పథకాలను అమలు చేస్తూ ప్రజలందరికి లబ్ధి చేకూరేలా ప్రభుత్వం పనిచేస్తుందన్నారు.

రాష్ట్రాన్ని అప్పులపాలు చేశారు

స్వరాష్ట్రం సిద్ధించిన సమయంలో ధనిక రాష్ట్రంగా ఉన్న తెలంగాణను బీఆర్ఎస్ పాలకులు తమ పదేళ్ల పాలనలో అప్పులపాలు చేశారని రాష్ట్ర డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క విమర్శించారు. గత పాలకులు చేసిన అప్పులను చెల్లిస్తూనే ఎన్నికల సమయంలో కాంగ్రెస్ సర్కార్ ఇచ్చిన హామీలను అమలుచేస్తూ వస్తున్నామని చెప్పారు. కాంగ్రెస్‌ప్రభుత్వానికి వస్తున్న ఆదరణను చేసి ఓర్వలేని బీఆర్ఎస్ నేతలు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వంపై బురదచల్లడమే పనిగా పెట్టుకుని విమర్శలు చేస్తున్నారని చెప్పారు. ప్రజలు ఎవరేంటో గమనిస్తున్నారని, ఇప్పటికే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు తగిన బుద్ధి చెప్పారని, వచ్చే ఏ ఎన్నికల్లో వారికి డిపాజిట్లు కూడా దక్కవన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ ఘన విజ యం సాధించనుందని ధీమా వ్యక్తం చేశారు. అనంతరం ఆయా సభల్లో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాలు, స్వయం సహాయక సంఘాల గ్రూపులకు రుణాల చెక్కులను పంపిణీ చేశారు.

రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన ఇందిరమ్మ ప్రభుత్వం పేదల పక్షాన పనిచేస్తూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలుచేస్తూనే హామీ ఇవ్వని పథకాలను సైతం అమలు ప్రవేశపెడుతుందని అన్నారు. గత ప్రభుత్వం అప్పుల పాలు చేస్తే వాటికి వడ్డీలు కడుతూనే కొత్తసంక్షేమ పథకాలను అమలు చేస్తున్నట్లు చెప్పారు. సన్నధాన్యంకు క్వింటాకు రూ.500 బోనస్‌తోపాటు రేషన్‌షాపుల ద్వారా పేదలకు సన్నబియ్యం అందిస్తున్న ఘటన కాంగ్రెస్ సర్కార్‌దేనన్నారు. అధికారం కోల్పోయిన బీఆర్ఎస్ నేతలు రంకెలు వేస్తూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని విమర్శించడమే పనిగా పెట్టుకున్నారని మండిపడ్డారు.

రాష్ట్ర రోడ్డు, భవనాలశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. రైతుల కళ్లలో ఆనందం చూడాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని, వారి కోసం ప్రత్యేకంగా నిధులు వెచ్చిస్తూ పథకాలను అమలు చేస్తున్నట్లు చెప్పారు. పిల్లల ఉజ్వల భవిష్యత్ కోసం స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లను ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. అనంతరం ఇందిరమ్మ లబ్ధిదారులకు ఇండ్ల మంజూరు పత్రాలు, మహిళా సంఘాల సభ్యులకు రూ.1.16 కోట్ల బ్యాంకు రుణాల చెక్కును అందించారు.

ఈ కార్యక్రమాల్లో ఇంకా మంత్రులు కొండా సురేఖ, సీతక్క, తుమ్మల నాగేశ్వర్‌రావు, రాష్ట్ర సీఎం సలహాదారులు వేం నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు భూక్య మురళీనాయక్, జాటోత్ రాంచందర్‌నాయక్, కోరం కనకయ్య, కేఆర్ నాగరాజు, ట్రైకార్ చైర్మన్ తేజావత్ బెల్లయ్యనాయక్, రాష్ట్ర నాయకులు జెన్నారెడ్డి భరత్‌చందర్‌రెడ్డి, వెన్నం శ్రీకాంత్‌రెడ్డి, ఝాన్సీరెడ్డి, కేసముద్రం మార్కెట్ చైర్మన్ గంటా సంజీవరెడ్డి, జిల్లా కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్, అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పో, డీఎఫ్‌వో భట్టు విశాల్, మానుకోట ఆర్డీవో కృష్ణవేణి, విద్యుత్‌శాఖ సీఎండీ వరుణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మా ప్రభుత్వ పథకాలు చరిత్రాత్మకమైనవి

(5వ పేజీ తరువాయి)

తెలిపారు. కేసముద్రంలో మంగళవారం నిర్వహించిన బహిరంగసభలో మంత్రులు మాట్లాడారు. తెలంగాణాలోనే పెద్దమార్కెట్ ఇక్కడ ఉందని, ఇలాంటి మార్కెట్లో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు ఆశీస్సులతో రూ.5కోట్లతో గోదాంలను మంజూరు చేశారని తెలిపారు. ఈ ప్రాంతానికే తలమానికంగా నిలిచే 132కేవీ సబ్‌స్టేషన్‌తోపాటు మరో మూడు సబ్‌స్టేషన్లు ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్క చొరవతో మంజూరయ్యాయని తెలిపారు. రూ.250కోట్ల రోడ్లను రోడ్లుభవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, దేవాదాయ శాఖ మంత్రి సురేఖ మండలంలోని ఏడు గుళ్లకు రూ.1.5కోట్లను, మంత్రి సీతక్క తన పంచాయతీరాజ్ శాఖ నుంచి నియోజకవర్గానికి రూ.80కోట్ల రోడ్లు మంజూరు చేశారని తెలిపారు. చరిత్రలో ఎవరూ చేయలేని పథకాలను అమలు చేస్తున్నామని, మహిళలకు ఉచిత బస్సు, రూ.10లక్షల ఆరోగ్యశ్రీ, రూ.21వేలతో రుణమాఫీ అమలు చేశామని తెలిపారు.

ఆనాడు మహానుభావుడు ఎన్టీఆర్ రూ.2కే కిలోబియ్యం ఇచ్చినట్లు చరిత్రాత్మకంగా నేడు కాంగ్రెస్ ప్రభుత్వం సన్నబియ్యం ఇస్తోందని, పేదలు తినే ప్రతీ బుక్కలో ప్రభుత్వం చేసిన సహాయం కనిపిస్తుందని తెలిపారు. 200 యూనిట్లు ఉచిత విద్యుత్, తొమ్మిది రోజుల్లో రూ.9వేల కోట్లు ఇస్తోందంటే కాంగ్రెస్ ప్రభుత్వ గొప్పదనమని అన్నారు. ప్రభుత్వంలోని సీఎం, మంత్రులు కష్టపడుతున్నామని, తెలంగాణలో అధికారం ఎవరి హక్కు కాదని, ప్రజల హక్కు అని, ప్రజల అభిమానంతోనే అధికారంలోకి వచ్చామని తెలిపారు. కష్టపడుతున్న ప్రభుత్వాన్ని స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆశీర్వదించాలని కోరారు.



కేసముద్రం బహిరంగసభలో మహిళలకు చెక్కును పంపిణీ చేస్తున్న ఉపముఖ్యమంత్రి, మంత్రులు



కేసముద్రం బహిరంగసభకు హాజరైన జనం

అభివృద్ధిని తట్టుకోలేక పోతున్నారు..

- అందుకే వ్యక్తిగత దూషణలకు దిగుతున్నారు
- ఎన్నికల హామీలను నెరవేరుస్తున్నాం..
- కేసముద్రం సభలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

కేసముద్రం, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : ప్రజల కోరికకు అనుగుణంగా పరిపాలించే కాంగ్రెస్ ప్రభుత్వ పరిపాలనతో బీఆర్ఎస్ నాయకులకు మైండ్‌బ్లాక్ అయి తట్టుకోలేక వ్యక్తిగత దూషణలకు దిగుతున్నారని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. కేసముద్రంలో మంగళవారం ఎమ్మెల్యే మురళీనాయక్ అధ్యక్షతన నిర్వహించిన బహిరంగసభలో మంత్రులు మాట్లాడారు. ఈ సందర్భంగా పొంగులేటి మాట్లాడుతూ మాజీ మంత్రిగా సభ్యసమాజం తలదించుకునే విధంగా మాట్లాడుతున్నారని, అది వారి సంస్కారానికే వదిలేస్తున్నామని అన్నారు. ధనిక తెలంగాణ రాష్ట్రంలో పదేళ్ల అధికారం ఇచ్చారని, ఏనాడైనా రూ.200 ఉచిత విద్యుత్ ఇవ్వదని, రూ.500 గ్యాస్ ఇవ్వద్దని, ఆడబిడ్డలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించవద్దని మేం అన్నామా అని ఎద్దేవా చేశారు. తొమ్మిది నెలలో 60వేల ఉద్యోగాలు ఇవ్వద్దని మేం అన్నామా, వరి వస్తే ఉరి అన్న మీకు వరి వేసిన వారికి బోనస్ ఇవ్వవద్దని మేం అన్నామా అని వ్యంగ్యంగా ప్రశ్నించారు. రూ.21వేల కోట్లు రైతులకు రుణమాఫీ చేసి రైతును రాజును చేయవద్దని మేం అన్నామా, క్వింటాకు రూ.500 బోనస్ ఇవ్వద్దని, పేదలకు సన్నబియ్యం ఇవ్వద్దమి మేం అన్నామా అంటూ ప్రశ్నించారు. ఇందిరమ్మ ప్రభుత్వంలో పేదలకు మంచి కార్యక్రమాలు చేస్తోంటే నీకు కడుపుమంట ఎందుకయ్యా అన్నారు. పదేళ్లలో పేదలకు రేషన్‌కార్డు ఇచ్చారా అన్నారు. డబుల్ బెడ్‌రూం ఇళ్లు అని ఊరించి ఎవరికీ ఇవ్వలేదని, ఇందిరమ్మ పథకమంటేనే ఇందిరమ్మ ఇళ్లు అని అన్నారు. పేదవాడి చిరకాల కోరిక 4.5లక్షల ఇళ్లు ఇచ్చామని రూ.22,500 కోట్లు ప్రతీ నియోజకవర్గానికి 3500 ఇళ్లు ఇచ్చామని, నియోజకవర్గానికి మరో వెయ్యి ఇల్లు ఇచ్చామని తెలిపారు. అర్హులైన ప్రతీ ఒక్కరికి విడతలవారీగా అందరికీ ఇచ్చామని తెలిపారు. మూడు గ్రామాల్లోని రెవెన్యూ సమస్యలను భూభారతిలో పరిష్కరించాలని జిల్లా కలెక్టర్‌ను ఆదేశిస్తున్నామని తెలిపారు. రైతుప్రభుత్వంలో ఎకరాకు రూ.12వేలను 9 రోజుల్లో రూ.9వేల కోట్లను టింగ్..టింగ్..అంటూ రైతుల ఖాతాల్లో వేశామని తెలిపారు. ఇందిరమ్మ ప్రభుత్వంలో స్థానిక సంస్థల్లో నిలబడే అభ్యర్థులను ఆశీర్వదించాలని కోరారు.



మాట్లాడుతున్న డిప్యూటీ స్పీకర్ రాంచంద్రునాయక్

జిల్లాకు గోదావరి జలాలు : మంత్రి తుమ్మల



నియోజకవర్గానికి ఏ అవసరం ఉన్నా మీ కోరికలు తీర్చేందుకే పనిచేస్తున్నామని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు అన్నారు. నియోజకవర్గానికి గోదావరి జలాలు తీసుకువస్తామని, కొద్దిరోజుల్లోనే జిల్లాకు గోదావరి జలాలు ఆర్థిక భారమైనా ఉపముఖ్యమంత్రి సహకారంతో ఒక్కొక్క అడుగు వేసుకుంటూ వెళుతున్నామని, తెలంగాణలాంటి సంక్షేమ రాజ్యం కావాలని ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులపై ప్రజలు ఒత్తిడి తీసుకువస్తున్నారని అన్నారు.

నిధుల వరద పనుల జాతర: మంత్రి సీతక్క



కేసముద్రంలో నిధుల, వరద పనుల జాతర కొనసాగుతోందని మంత్రి సీతక్క అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారధ్యంలో పేదలకు సన్నబియ్యం ఇచ్చి కడుపునిండా అన్నం పెడుతున్నారని, నిలువనీడ కల్పించేందుకు ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తున్నారని తెలిపారు. ఉచితంగా విద్యుత్, ఏడాదిన్నరలోపే 60వేల ఉద్యోగాలు ఇచ్చిన చరిత్ర కాంగ్రెస్‌దేనని అన్నారు. మహిళా సంఘాలకు రూ.25వేల కోట్ల బ్యాంకు లింకేజి ఇచ్చామని, రూ.2కోట్లతో కేసముద్రంలో ఇందిరా మహిళా శక్తి భవనం మంజూరు చేశామని తెలిపారు. మహిళలకు రూ.10లక్షల బీమా ఇచ్చామని, రూ.5కోట్లతో మహబూబాబాద్ మహిళా శక్తి భవనం మంజూరు చేసినట్లు తెలిపారు. 18 ఏళ్ల నుంచి 60 ఏళ్ల వరకు ఉన్న మహిళలు సంఘాల్లో చేరాలని పిలుపునిచ్చారు.

వేం ఉండడం కేసముద్రం అదృష్టం: మంత్రి సురేఖ



సీఎం ప్రధాన సలహాదారుడిగా వేం నరేందర్‌రెడ్డి ఉండడం కేసముద్రం ప్రజల అదృష్టమని, ఎవరూ ఊహించని విధంగా వందల కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు మంజూరు చేయిస్తున్నారని దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. గత ప్రభుత్వంలో ప్రజల సమస్యలను పట్టించుకోలేదని, ఇందిరమ్మ రాజ్యంలో సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో అర్హులైన నిరుపేదలకు పథకాలు చేరాలనే లక్ష్యంతో అమలు చేస్తున్నారని తెలిపారు. సంక్షేమ పథకాలను పొందుతున్న ప్రతీ ఒక్కరూ ప్రభుత్వం చేస్తున్న సహాయాన్ని గుర్తుపెట్టుకోవాలని కోరారు. ప్రజలను మభ్యపెట్టేందుకే ప్రతిపక్షాలు ప్రయత్నిస్తున్నాయని, వారిని నమ్మవద్దని, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని కోరారు.

రూ.175కోట్ల అభివృద్ధి పనులు: మంత్రి కోమటిరెడ్డి



తన శాఖ నుంచి కేసముద్రంలో రూ.175కోట్ల అభివృద్ధి పనులు మంజూరు చేసినట్లు రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. పరిశ్రమలు రావాలంటే రోడ్లు రావాలని, మండలంలో వివిధ మార్గాలకు రాబోయే కాలంలో ప్రతీరోడ్డును బీటీ రోడ్డుగా మారుస్తామని అన్నారు. ఈ రాష్ట్రం సుభిక్షంగా ఉండాలంటే వచ్చే 15 ఏళ్లు కాంగ్రెస్ అధికారంలో ఉండాలని అన్నారు.

నిధులు మంజూరు చేయరూ..

డిప్యూటీ సీఎం, మంత్రులకు ఎమ్మెల్యే మురళీనాయక్ విన్నపాలు



కేసముద్రం బహిరంగసభలో ఇందిరమ్మ ఇళ్ల పత్రాలను పంపిణీ చేస్తున్న ఉపముఖ్యమంత్రి, మంత్రులు

కేసముద్రం, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ మండలం సోమ్లాతండా సభలో రాష్ట్ర డిప్యూటీ సీఎం, మంత్రులకు స్థానిక ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ నియోజకవర్గానికి కావాల్సిన అవసరాలను విన్నవించుకున్నారు. మహబూబాబాద్ పట్టణానికి ఔటర్ రింగురోడ్డు, జిల్లా కేంద్రంలోని మున్నేరు వాగు వద్ద బతుకమ్మ ఘట్, జేఎన్‌టీయూ కళాశాలకు భవన నిర్మాణం, పర్వతగిరి నుంచి అమనగల్‌కు లింకురోడ్డు, బీఎన్.గుప్తా(తులరాం ప్రాజెక్టు) ఎత్తు పెంచి కంబాలపల్లి, ఈదులపూసపల్లి పెద్ద చెరువుల్లో నీటి నిల్వ చేసుకుంటే సాగు, తాగునీరుకు ఇబ్బందులు ఉండవని, వీటిని పెదమనస్సుతో మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు సీతక్క, కొండా సురేఖ, తుమ్మల నాగేశ్వర్ రావు, రాష్ట్ర సీఎం సలహాదారులు వేం నరేంద ర్‌రెడ్డి, ఎంపీ పోరిక బలరాంనాయక్, డిప్యూటీ స్పీకర్ జాటోత్ రాంచందర్‌నాయక్, ఎమ్మెల్యేలు కేఆర్.నాగరాజు, కోరం కనకయ్య, ట్రైకార్ చైర్మన్ తేజావత్ బెల్లయ్యనాయక్, డీసీసీ అధ్యక్షులు జెన్నారెడ్డి భరత్‌చందర్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు వెన్నం శ్రీకాంత్‌రెడ్డి, ఝాన్సీరెడ్డి, మేకల వీరన్న, జిల్లా కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్, అదనపు కలెక్టర్ లెనిన్‌వత్సల్ టొప్పో, డీఎఫ్‌వో బత్తుల విశాల్, ఆర్డీవో కృష్ణవేణి పాల్గొన్నారు.

వేం వాహనంలో పొగలు



మహబూబాబాద్ మండలం సోమ్లాతండాలో సీఎం సలహాదారులు వేం.నరేందర్‌రెడ్డి కారులో పొగలను ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

మహబూబాబాద్ టౌన్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): మహబూబాబాద్ మండలం సోమ్లాతండాలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు వేం. నరేందర్‌రెడ్డి వాహనంలో మంగళవారం ఏసీ వద్ద వైర్లు షార్ట్‌సర్క్యూట్ (స్పార్క్)తో స్వల్పంగా పొగలు వచ్చాయి. సోమ్లాతండాలో డిప్యూటీ సీఎం, మంత్రుల పర్యటన నేపథ్యంలో సీఎం సలహాదారులు తన వాహనంలో అక్కడకు చేరుకున్నారు. అదే వాహనంలో హెలీప్యాడ్ వద్దకు చేరుకున్నా రు. ఆయన దిగి వెళ్లాక తిరిగి వాహనాన్ని స్టార్ట్ చేస్తున్న క్రమంలో ఏసీ పాయింట్ వద్ద వైర్లలో స్పార్క్‌తో పొగలు వచ్చా యి. దీంతో అప్రమత్తమైన అగ్నిమాపక సిబ్బంది నీటితో పొగలను ఆర్పారు. ఆ తర్వాత వాహనం స్టార్ట్ అయి వెళ్లిపోయింది.

హోరెత్తిన కాంగ్రెస్ సభలు

- మంత్రుల ప్రసంగాలతో ఎన్నికల జోష్
- పార్టీ కేడర్‌లో నూతనోత్సాహం
- స్థానిక సమరానికి శంఖారావం
- సోమ్లాతండా, కేసముద్రం సభలకు భారీ జనసమీకరణ

మహబూబాబాద్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల అనంతరం అధికారం చేపట్టిన కాంగ్రెస్ పార్టీ సరిగ్గా ఏడాదిన్నర తర్వాత మహబూబాబాద్ జిల్లాలో నిర్వహించిన ప్రజాపాలన- ప్రగతిబాట అభివృద్ధి శంకుస్థాపనల బహిరంగ సభలు ఆ పార్టీ శ్రేణుల్లో రానున్న ఎన్నికలకు కొత్త ఉత్సాహాన్ని నింపాయి. సోమ్లాతండాలో రూ.100కోట్లతో, కేసముద్రంలో రూ.300కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క ముఖ్యఅతిదిగా హాజరుకాగా రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వర్‌రావు, సీతక్క, కొండా సురేఖలు కూడా పాల్గొనడంతో పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహం ఉరకలెత్తింది. అందులోను మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి స్థానిక ఎన్నికల ప్రస్తావన తీసుకురావడం పరోక్షంగా స్థానిక సమరానికి ఈ సభలు శంఖారావంగానే పరిగణించవద్దని పరిశీలకులు విశ్లేషణలు చేస్తున్నారు. ప్రధానంగా దశాబ్ధకాలం అనంతరం ఇందిరమ్మ రాజ్యం కావాలని తెలంగాణ ప్రజలంతా కోరుకోవడంతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేస్తున్నామని డిప్యూటీ సీఎం భట్టితో పాటు హాజరైన మంత్రులంతా అభివృద్ధి ఫలాలను ఏకరువు పెట్టడం కూడా స్థానిక సంస్థల ఎన్నికల్లో లబ్దిపొందే ప్రయత్నంగా కనిపించింది. దీనికితోడు ఈ సభలకు భారీగా జనసమీకరణ చేయడం ర్యాలీలతో కేసముద్రంలో హోరెత్తించడం చూస్తే గ్రామాలు, మండలాల్లో కాంగ్రెస్‌కు ఉన్న బలం ప్రస్పుటమైంది. సోమ్లాతండా సభకు స్థానిక ఎమ్మెల్యే మురళీనాయక్ అన్నీతానై జనసమీకరణకు పూనుకోగా కేసముద్రం సభను అంతకు మరింతగా విజయవంతం చేసేందుకు మాజీ ఎమ్మెల్యే అయిన ప్రస్తుత సీఎం ప్రధాన సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డి తన సొంత మండలం కావడంతో ప్రత్యేక చొరవ చూపారు. దీంతో ఈ సభకు కేసముద్రంతోపాటు మహబూబాబాద్, చుట్టుపక్కల మండలాలు, గ్రామాల నుంచి భారీగా తరలివచ్చి అభిమానాన్ని చాటుకున్నారు. కేసముద్రం సభలో స్వయాన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో పాటు మంత్రులం దరూ ఒక్కసారి ఎమ్మెల్యేగా గెలిపించిన ఈ నియోజకవర్గాన్ని మర్చిపోకుండా రూ. కోట్ల అభివృద్ధి పనులు మం జూరు చేయించు కోవడంలో ఇక్కడిమాజీ ఎమ్మెల్యే, ప్రస్తుత సీఎం ప్రధాన సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డి చూపిన చొరవ అభినందనీయమని కొనియాడారు.గిరిజన నియోజకవర్గమే కాకుండా ఈ ప్రాంత అభివృద్ధికి అన్ని శా ఖల నుంచిఇంకా కావాల్సిన అభివృద్ధి ఫలాలు అందుతాయని హామీలు గుప్పించారు.

దృశ్యమాలిక



సోమ్లాతండా సభావేదికపై తెలంగాణ గీతాన్ని ఆలపిస్తున్న డిప్యూటీ సీఎం, రాష్ట్ర మంత్రులు



మహబూబాబాద్ మండలం సోమ్లాతండా సభలో జ్యోతిప్రజ్వలన చేస్తున్న రాష్ట్ర డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు



మహబూబాబాద్ సోమ్లాతండాలో స్వయం సహాయ సంఘాల గ్రూపులకు బ్యాంకు రుణాలు అందిస్తున్న డిప్యూటీ సీఎం, రాష్ట్ర మంత్రులు

అభివృద్ధిని చూడలేక కండ్లల్లో నిప్పులు

- 70 ఏండ్లలో కోయజాతికి అవకాశం వస్తే తట్టుకోలేక పోతున్నారు
- నన్ను ఓడించేందుకు వందల కోట్లు ఖర్చు చేశారు
- ములుగును అభివృద్ధి చేస్తుంటే అడ్డుకునేందుకు ప్రయత్నాలా?
- కేటీఆర్.. ఇప్పటికే నీ చెల్లి నీపైన దుమ్మెత్తి పోస్తుంది
- నాతో పెట్టుకుంటే నాశనమైపోతావు
- నీకు కుల బలం, ధనబలముంటే నాకు ప్రజల ఆశీర్వాదముంది
- విలేకరుల సమావేశంలో మంత్రి సీతక్క

ములుగు, జూలై 8(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక బీఆర్ఎస్ నాయకులు కళ్లల్లో నిప్పులు పోసుకుంటున్నారని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి సీతక్క వ్యాఖ్యానించారు. ములుగు జిల్లా కేంద్రంలోని ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌజ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. 70 ఏళ్ల చరిత్రలో ఒక కోయ జాతి మహిళకు మంత్రిగా అవకాశం వచ్చిందని, దీన్ని తట్టుకోలేకపోతున్నారని ధ్వజమెత్తారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో తను ఓడించేందుకు బీఆర్ఎస్ నేతలు కోట్ల రూపాయలు ఖర్చు చేశారని ఆరోపించారు. ఆ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు కూడా తాను ములుగు ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహించానని, కాంగ్రెస్ వచ్చాక కూడా ఈ నియోజకవర్గ అభివృద్ధిని అడ్డుకుంటున్నారని మండిపడ్డారు. 'కేటీఆర్.. నీకు కుల బలం, ధన బలం అహంకారం ఉంటే.. నాకు ప్రజల ఆశీర్వాదం ఉంది' అని ధీమా వ్యక్తం చేశారు. ప్రజల దీవెనలతోనే తాను ఎమ్మెల్యే నయ్యానని, రాహుల్ గాంధీ, రేవంత్‌రెడ్డిల సహకారంతో మంత్రిని కూడా అయ్యానని అన్నారు.

ఇంటి ఆడబిడ్డను కూడా ఇబ్బంది పెట్టావ్..

ఇంట్లో ఆడబిడ్డను, బయటి ఆడబిడ్డను ఇబ్బందులకు గురిచేస్తున్నావని కేటీఆర్‌ను ఉద్దేశించి మంత్రి సీతక్క ధ్వజమెత్తారు. ఇప్పటికే 'నీ చెల్లి నీపైన దుమ్మెత్తి పోస్తోంది. ఇప్పుడు నాతో పెట్టుకుంటే నాశనమైపోతావు' అని వ్యాఖ్యానించారు. రాష్ట్ర ముఖ్యమంత్రిని పట్టుకుని అగౌరవంగా మాట్లాడడం దొర దురహంకారానికి నిదర్శనమన్నారు. సిరిసిల్లలో అమాయక ప్రజలను లారీలతో తొక్కించి చంపిన నీచ చరిత్ర మీదని మండి పడ్డారు. మీ పాలనలో సిద్దిపేటలో ఆటోడ్రైవర్, కొత్తగూడెం, నర్సంపేట, గజ్వేల్‌లో అమాయకపు ప్రజల ఆత్మహత్యకు మీరు కారణం కాదా? అని ప్రశ్నించారు. ఇలా చెప్పుకుంటూ పోతే మీ వల్ల బాధపడ్డ వారి లిస్టు పెద్దదేనన్నారు. ప్రజలను హింసించి అక్రమ కేసులు పెట్టించి జైలుకు పంపించిన నీచులు మీరన్నారు. మంథనిలో ఇద్దరు లాయర్లను ఎవరు చంపించారో ప్రజలకు తెలుసన్నారు. ఉద్యమ సమయంలో కిరోసిన్ పోసుకుని అగ్గిపెట్టె డ్రామా ఆడిన వాళ్లు మీరని గుర్తుచేశారు. మీ డ్రామాలో పడి ఎందరో అమాయకులు బలయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు.

పేదల కుటుంబాలను ఆదుకోక డ్రామాలు

గతంలో ములుగు జిల్లాలో బీఆర్ఎస్ కార్యకర్త నాగయ్య మరణిస్తే రోడ్లపై కూర్చోని డ్రామాలు చేశారే తప్ప వారి కుటుంబాన్ని ఆదుకోలేదని మండిపడ్డారు. నాగయ్య భార్యకు తాను అంగన్‌వాడీలో టీచర్ పోస్టు ఇప్పించానన్నారు. నిరు పేదలకు బీఆర్ఎస్ పాలనలో వెయ్యి ఇళ్లు కట్టించలేదని, పేదలకు తాము కట్టి ఇస్తుంటే అవాకులు చెవాకులు పేలుతారా? అని మండిపడ్డారు. బీఆర్ఎస్ హయాంలో కల్వకుంట్ల కాన్స్టిట్యూషన్ నడిచిందని, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో ప్రజాపాలన, ప్రజాస్వామ్య పాలన సాగుతోందని అన్నారు. ప్రైవేటు విత్తన కంపెనీల చేతుల్లో మోసపోయిన రైతులకు బీఆర్ఎస్ నష్ట పరిహారం చెల్లించారా? అని ప్రశ్నించారు. ములుగు జిల్లా పోలీసులు ఎస్సీ, ఎస్టీ, బీసీలు ఉన్నారని, వారిని అవమానించేలా కేటీఆర్ మాట్లాడితే సహించబోమని హెచ్చరించారు. ప్రస్తుతం ములుగులో ప్రజా స్వామ్య పాలన నడుస్తోందన్నారు. ములుగు ఒక ఉద్యమ చరిత్ర అని, అందమైన అడవులు, సమ్మక్క-సారలమ్మలు పుట్టిన నేలని, రామప్ప దేవాలయం, ఎన్నో ప్రకృతి వనాలు ఉన్న జిల్లా అని దీనిపై రాజకీయ కుట్రలు చేయొద్దని హెచ్చరించారు. ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డికి ఈ జిల్లాపై ఎంతో మక్కువ ఉందన్నారు. రుద్రేశ్వరుడి పేరు వచ్చేలా తన మనువడికి పేరు పెట్టుకున్నారని అన్నారు. నాజీవితం తెలిచిన పుస్తకమని, నేనెవరికీ అన్యాయం చేసిన దాఖలాలు లేవన్నారు. విప్లవ ఉద్యమంలో కూడా శాంతియుత ఉద్యమం చేశాని గుర్తుచేశారు. ఈ సమావేశంలో జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ కళ్యాణి, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు, నియోజకవర్గ కోఆర్డినేటర్ గొళ్లపెల్లి రాజేందర్‌గౌడ్, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు వంగ రవి యాదవ్, పట్టణ అధ్యక్షుడు చింతనిప్పుల బిక్షపతి, నాయకులు అహ్మద్‌పాషా, ఓంప్రకాష్, కుమార్, తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

ప్రాణరక్షణ కోసం సివంగులయ్యారు..

(5వ పేజీ తరువాయి)

గుగులోత్ జున్నుబాయ్(పెద్దభార్య తల్లి)ని మద్యం కోసం డబ్బులు అడిగాడు. దీంతో ఇద్దరి మధ్య గొడవ తలెత్తడంతో అత్త జున్నుబాయ్‌ని హత్య చేసి పరారయ్యాడు. కనకయ్య ఇద్దరు భార్యలు పిట్టలోనిగూడెంలోనే ఉంటున్నారు. పెద్ద భార్యకు కుమారుడు ఉన్నాడు. మంగళవారం తెల్లవారుజామున పిట్టలోనిగూడెం చేరుకున్న కనకయ్య మద్యం మత్తులో తన చేతిలోని గొడ్డలితో ఇద్దరు భార్యలను చంపుతానని దాడికి యత్నించాడు. దీంతో భయాందోళనకు గురైన ఇద్దరు భార్యలు భర్త చేతిలోని గొడ్డలి తీసుకుని ప్రతిదాడి చేయడంతో అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు. సమాచారం అందుకున్న జనగామ రూరల్ సీఐ శ్రీనివాస్‌రెడ్డి, లింగాలఘణపురం ఎస్సై బండి శ్రవణ్‌కుమార్ ఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు. మృతుడి చిన్నమ్మ లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

అప్పుడు రక్షించారు.. ఇప్పుడు హతమార్చారు..

కనకయ్య మే 18న తన అత్తను హత్య చేసిన విషయం భార్యలకు తెలియకుండా అతి తెలివి ప్రదర్శించాడు. తాగిన మైకంలో స్నేహితుడు సుధాకర్‌తో సుద్దాలలో గొడవ జరిగిందని వాళ్లు తనను చంపేందుకు వస్తున్నారని నమ్మబలికి తన భార్యలను బైక్‌పై ఎక్కించుకుని సిద్దిపేటకు పరారయ్యాడు. చొక్కమ్మకు తన తల్లిని భర్త హత్య చేశాడనే విషయం తెలియకపోవడంతో రోజులాగే కూలికి వెళ్తోంది. అయితే కనకయ్య సిద్దిపేట శివారులో ఉన్నట్లు సమాచారం అందుకున్న మృతురాలి బంధువులు అక్కడికి వచ్చి అతడిని పట్టుకుని చెట్టుకు కట్టేశారు. అయితే తమ భర్తను పోలీసులకు పట్టిస్తారనే భయంతో కట్లు విప్పేసి తప్పించారు. ఆ తర్వాత అక్కడికి చేరుకున్న బంధువులు కనకయ్య చేసిన దారుణాన్ని భార్యలకు వివరించడంతో హతాశులయ్యారు. అప్పటికే కనకయ్య అక్కడి నుంచి పరారయ్యాడు. జున్నుబాయ్‌కి భర్త, పిల్లలు ఉన్నా.. సంచార జీవితం గడుపుతున్న కూతురు చొక్కమ్మ ఆచూకీ తెలియకపోవడంతో సమాచారం ఇవ్వలేకపోయారు. దీంతో వారు అంత్యక్రియలు నిర్వహించారు.

రెండు నెలల తర్వాత గ్రామానికి..

రెండు నెలల తర్వాత పిట్టలోనిగూడెంకు వ చ్చిన కనకయ్య వచ్చాడు. మద్యం మత్తులో భా ర్యలపైదాడి చేసేందుకు రాగా ప్రమాదాన్ని పసిగట్టిన భార్యలు ప్రతిదాడికి దిగి హతమార్చారు.

అస్తవ్యస్తంగా అంగన్‌వాడీలు

అరకొర వసతులతో అవస్థలు • జిల్లాలో 640 కేంద్రాలు • సొంత భవనాలు 276 మాత్రమే..



ఏటూరునాగారం మండలం మల్యాలలో అద్దె భవనంలో కొనసాగుతున్న అంగన్‌వాడీ కేంద్రం

ములుగు, జూలై 2(ఆంధ్రజ్యోతి): ఆరేళ్ల లోపు చిన్నారులకు ఆట పాటలతో కూడిన విద్యను అందించేందుకు ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలను నిర్వహిస్తోంది. అయితే.. జిల్లాలో సొంత భవనాలు లేక అనేక సెంటర్లు సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతున్నాయి. అద్దె భవనాల్లోనే అవస్థల నడుమ కొనసాగుతున్నాయి. అరకొర సౌకర్యాలతో చిన్నారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పలు మండలాల్లో కనీస సౌకర్యాలు లేని అద్దె గదుల్లో అంగన్‌వాడీ కేంద్రాలను నడుపుతున్నారు. చిన్నారులకు చదువుతో పాటు ఆటపా టలు నేర్పించాల్సిన టీచర్లు, పిల్లల ఆలనా పాలనా చూడాల్సిన హెల్పర్లు పూర్తిస్థాయిలో లేకపోవడంతో అంగన్‌వాడీ కేంద్రాల పరిస్థితి అస్తవ్యస్తంగా మారింది.

ములుగు జిల్లాలో అంగన్‌వాడీ కేంద్రాలు చాలా వరకు అద్దె భవనాల్లోనే నడుస్తున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే సొంత భవనాలు నిర్మిస్తారేమోనని ఆశపడిన వారికి నిరాశే మిగిలింది. జిల్లా వ్యాప్తంగా నాలుగు సెక్టార్లు ఉండగా, వాటిలో 640 అంగన్‌వాడీ సెంటర్లు ఉన్నాయి. వీటిలో కేవలం 276 ప్రభుత్వ భవనాలు ఉన్నాయి. ఉచిత వసతి పొందుతున్నవి 211 ఉండగా, 153 అంగన్‌వాడీ కేంద్రాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. అయితే.. వాటిలోని అరకొర సౌకర్యాలతో చిన్నారులు తీవ్ర ఇబ్బందులు పెడుతున్నారు. పలు సెంటర్లలో మూత్రశాలలు, మరుగుదొడ్లు లేకపోవడంతో అవస్థలు పడుతున్నారు. కొన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో తాగేందుకు మంచినీరు అందుబాటులో ఉండడంలేదని పిల్లల తల్లిదండ్రులు అంటున్నారు. చిన్నారులు ఆడుకునేందుకు విశాలమైన ఆట స్థలాలు కూడా లేవని చెబుతున్నారు.

వేధిస్తున్న సిబ్బంది కొరత

అంగన్ వాడీ సెంటర్లను సిబ్బంది కొరత తీవ్రంగా వేధిస్తోంది. జిల్లా వ్యాప్తంగా 640 సెంటర్లలో 640 మంది టీచర్లు పని చేయాల్సి ఉండగా 544 మంది మాత్రమే ఉన్నారు. 640 మంది హెల్పర్లు పనిచేయాల్సి ఉండగా 322 మంది మాత్రమే పనిచేస్తున్నారు. మిగిలిన 96 మంది టీచర్ల, 318 మంది ఆయాల స్థానంలో ఉన్న వారికే అదనపు బాధ్యతలు అప్పగించినట్లు తెలుస్తోంది. ములుగు జిల్లాలో నాలుగు ఐసీడీఎస్ ప్రాజెక్టులు ఉండగా వాటిలో 15,146 మంది విద్యార్థులు ఉన్నారు. వీరిలో 7 నెలల నుంచి 3 సంవత్సరాలలోపు చిన్నారులు 8,722 మంది, 3 సంవత్సరాల నుంచి 6 సంవత్సరాల లోపు పిల్లలు 6,424 మంది ఉన్నారు. 1864 మంది గర్భిణులు, 1800 మంది బాలిం తలు ఉన్నారు. అయితే.. బాలింతల, గర్భిణుల, పిల్లల వివరాలు సేకరించి వాటిని ఆన్‌లైన్‌లో నమోదు చేసేందుకు సరిపడా సిబ్బంది లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉన్న పని చేయడానికే అవస్థలు పడుతున్న వారికి అదనపు బాధ్యతలు అప్పగించడంతో తీవ్రంగా శ్రమించాల్సి వస్తోందని పలువురు టీచర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వచ్చేదే అరకొర వేతనాలని, అంతకు మించి పనిచేయాల్సి వస్తోందని ఆవేదన చెందుతున్నారు.

జీతాలు పెరిగేనా..?

అంగన్‌వాడీ కేంద్రాలలో పనిచేస్తున్న టీచర్లకు, హెల్పర్లకు చాలీ చాలని గౌరవ వేతనాలు అందుతున్నాయి. దీంతో ఇల్లు గడవడం కూడా కష్ట తరమవుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వారి ఆవేదనను అర్థం చేసుకున్న మంత్రి ధనసరి సీతక్క ఇటీవల హైదరాబాద్‌లో అధికారులతో సమావేశమై అంగన్‌వాడీ టీచర్లకు రాష్ట్ర ప్రభుత్వం రూ. 10,950, హెల్పర్లకు రూ. 6,450 చెల్లిస్తుంటే... కేంద్రం ప్రభుత్వం టీచర్లకు రూ. 2,700, హెల్పర్లకు రూ. 1,350 మాత్రమే చెల్లిస్తోందని తెలిపారు. దీంతో కేంద్ర మంత్రి స్పందించి త్వరలో హైదరాబాద్‌లో జాతీయ సదస్సు నిర్వహించి నిధుల కేటాయింపుపై చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. దీంతో త్వరలో జరగనున్న జాతీయ సదస్సులో తమ జీతాలు పెరుగుతాయని అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

సీఎం నిర్ణయంతో దశ మారేనా..?

ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి తెలంగాణలోని అంగన్‌వాడీ కేంద్రాలను దేశానికి రోల్ మోడల్‌గా తీర్చి దిద్దేలా నిర్ణయించుకున్నారు. అనుకున్నదే తడువుగా అధికారులతో గత నెల 30న తన నివాసంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా నిర్మించబోయే అంగన్‌వాడీ భవనాలు కంటేనర్ల తరహాలో బ్యాటరీ బ్యాకప్, సోలార్ విద్యుత్ పలకలను ఏర్పాటు చేసి చిన్నారులకు అనుకూలంగా ఉండేలా డిజైన్లు తయారు చేయాలని ఆదేశించారు. సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయంతో అంగన్‌వాడీలకు కంటేనర్ల తరహాలో నూతన భవనాలు వస్తాయని, దీంతో అంగన్‌వాడీ కేంద్రాల దశ మారనుందని పలువురు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అయితే.. అంగన్‌వాడీలలో ఏర్పడిన ఖాళీల విషయమై సీఎం మాట్లాడకపోవడంతో నిరాశకు గురయ్యారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఖాళీలు భర్తీ చేస్తే నిరుద్యోగులకు జీవనోపాధి దొరుకుతుందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

పకడ్బందీగా వృద్ధుల పోషణ చట్టం అమలు

ములుగు కలెక్టరేట్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో తల్లిదండ్రులు, వృద్ధుల పోషణ, సంక్షేమచట్టం-2007ను పకడ్బందీగా అమలు చేస్తున్నామని ఆర్డీవో వెంకటేశ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తల్లిదండ్రులు, వృద్ధుల హక్కులు, వారి ఆత్మగౌరవాన్ని కాపాడేందుకు డివిజన్‌లోని తహసీల్దార్లు, న్యాయ బృందాలతో సమన్వయం చేసుకుంటూ ఆరు నెలల్లో 28 ఫిర్యాదులను స్వీకరించి 24 ఫిర్యాదులకు ఉత్తర్వులు జారీ చేయగా మిగతా నాలుగు విచారణ దశలో ఉన్నాయని వివరించారు. పరిష్కరించిన ఫిర్యాదులతో రెండు కేసుల్లో వారసుల పేరుమీద రిజిస్ట్రేషన్ చేసిన భూములను తిరిగి వారి తల్లిదండ్రుల పేరుపై బదిలీ చేయడానికి ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు. వృద్ధుల పట్ల నిర్లక్ష్యం చేసిన వారసులకు నెలవారీ పోషణ ఖర్చుగా రూ.3వేల నుంచి రూ.10వేల వరకు సంబంధిత తల్లిదండ్రులు, వృద్ధుల ఖాతాలో జమ చేయాలన్న ఆదేశాలు జారీ చేశామని పేర్కొన్నారు. పోషణ ఖర్చులు చెల్లించని వారసులపై ఒక నెల జైలుశిక్ష విధించడం జరుగుతుందని తెలిపారు.

మద్యానికి బానిసై యువకుడి ఆత్మహత్య



వినయ్ (ఫైల్)

ఏటూరునాగారం, జూలై 8 (ఆంధ్రజ్యోతి): మద్యానికి బానిసైన యువకుడు గడ్డి మందు తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల కేంద్రంలో చోటుచేసు కుంది. ఎస్సై రాజ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. “ండల కేంద్రంలోని తాళ్లగడ్డకు చెందిన పంజాల కృష్ణ, మంజుల రెండో కుమారుడు వినయ్ (22) కొన్నేళ్లుగా మద్యానికి బాని సయ్యాడు. మద్యం మానుకోవాలని తల్లిదండ్రులు పదే పదే మందలించారు. అయినప్పటికీ వినయ్ మద్యం మానుకోకపోగా ఈనెల 6న ఆదివారం రాత్రి సమయంలో మద్యం అతిగా సేవించి క్షణికావేశంలో ఇంట్లో ఉన్న గడ్డి మందు తాగాడు. దీంతో కుటుంబీకులు మండల కేంద్రంలోని సామాజిక ప్రభుత్వ ఆస్ప త్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. అక్కడ మంగళవారం తెల్లవారుజామున వినయ్ మృతి చెందాడు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి : ఏఎస్పీ

ఏటూరునాగారం, జూలై 8 (ఆంధ్రజ్యోతి): వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఏటూరునాగారం ఏఎస్పీ శివం ఉపాధ్యాయ అన్నారు. రోడ్లపై వాహనాలను ఎక్కడపడితే అక్కడ నిలిపితే చట్టపరమైన చర్యలు తప్ప వని హెచ్చరించారు. మండల కేంద్రంలోని ఏఎస్పీ కార్యాలయంలో టీఎస్‌ఎం డీసీ పీవో, ఏటూరునాగారం, మల్లూరు, చుంచుపల్లి ఇసుక క్వారీల కాంట్రాక్టర్లతో ఏఎస్పీ మంగళవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ ఇసుక లారీలను పార్కింగ్ చేయడానికి సరైన స్థలాన్ని ఏర్పాటు చేసుకోవాలని, రోడ్లపై విచ్చల వీడిగా నిలపరాదని ఆదేశించారు.

పీహెచ్‌సీని సందర్శించిన డీఎంహెచ్‌వో

ములుగు రూరల్, జూలై 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాయినిగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డీఎంహెచ్‌వో గోపాల్‌రావు మంగళవారం సందర్శించారు. సిబ్బందితో సమావేశమై పలు అంశాలు మాట్లాడారు. వర్షాకాలం దృష్ట్యా ర్యాపిడ్ యాక్షన్ టీం ఏర్పాటు చేసుకొని మలేరియా, డెంగీ వ్యాధులు వచ్చిన వారి గ్రామాన్ని సందర్శించి నివారణ చర్యలను చేపట్టాలని వైద్యాధికారి డాక్టర్ నాగ్ అన్వేష్‌కు సూచించారు. ఈ సమావేశంలో జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్స్ డాక్టర్ పవన్ కుమార్, శ్రీకాంత్, రణధీర్, సురేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

తప్పుడు ప్రచారాలు నమ్మొద్దు

మంగపేట, జూలై 8 (ఆంధ్రజ్యోతి): కమలాపురంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులను డబ్బులు తీసుకొని ఎంపిక చేశారని కాంగ్రెస్ నాయకులపై వస్తున్న తప్పుడు ప్రచారాలను నమ్మొద్దని ఆ పార్టీ కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు గుమ్మడి సోమయ్య అన్నారు. కమలాపురంలో కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు బేవర సత్యానారాయణ అధ్యక్షతన కార్యకర్తల సమావేశం మంగళవారం జరిగింది. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక విషయంలో వస్తున్న ఆరోపణలను సోమయ్య ఈ సందర్భంగా ఖండించారు. సమావేశంలో కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి తూడి భగవాన్‌రెడ్డి, బీసీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు పెద్ది నర్సింహరావు తదితరులు పాల్గొన్నారు.

బురుద రోడ్లపై నాటు వేసి నిరసన

మంగపేట, జూలై 8 (ఆంధ్రజ్యోతి): పొద్మూరు ఎస్సీ కాలనీ పూర్తిగా బురుదగా మారి రాకపోకలకు ఇబ్బంది కలుగుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. పలుమార్లు అధికారులకు ఫిర్యాదులు చేసినా స్పందిం చలేదని ఆగ్రహం వ్యక్తం చేస్తూ బురదమయమైన రోడ్లపై నాటు వేసి వినూత్న నిరసన తెలిపారు.

ప్రైవేట్ విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలి

వెంకటాపురం, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీలో విచ్చలవిడిగా అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేట్ విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని గోండ్వాన సంక్షేమ పరిషత్ జిల్లా అధ్యక్షుడు పూనెం ప్రతాప్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో మంగళవారం జరిగిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. ములుగు జిల్లాలోని అనేక ప్రైవేట్ పాఠశాలలు అధిక ఫీజులు వసూలు చేస్తున్నాయని, అనుమతులు లేని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ సమావేశంలో నాయకులు కణితి సురేష్, లక్ష్మయ్య, సోడి శివకుమార్, నరేంద్ర, కోరం నాగరాజు, పూనెం గోపాల్ పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలి

ఏటూరునాగారం, జూలై 8 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక సమ్మె, జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని సీపీఐ ములుగు జిల్లా కార్యదర్శి తోట మల్లికార్జునరావు కోరారు. మండల కేంద్రంలో సీపీఐ మండల స్థాయి సమావేశం మంగళవారం జరిగింది. కేంద్ర ప్రభుత్వం మావోయిస్టులపై కొనసాగిస్తున్న కగార్ ఆపరేషన్‌ను వెంటనే నిలిపివేయాలని ఆయన డిమాండ్ చేశారు. మావో యిస్టులతో చర్యలు జరపాలని, వారి సమ స్యలపై సానుకూలంగా స్పందించి వారికి విముక్తి కలిగించాలని కోరారు. .

బెగ్లూర్ పాఠశాలకు సకల సౌకర్యాలు: డీఈవో

మహదేవపూర్ రూరల్, జూలై 8(ఆంధ్రజ్యోతి) : మండలంలోని బెగ్లూర్ పాఠశాలకు అన్ని సౌకర్యాలు కల్పిస్తానని జిల్లా విద్యా.దికారి (డీఈవో) రాజేందర్ తెలిపారు. పాఠశాలను మంగళవారం సందర్శించిన ఆయన ఉపాధ్యాయులతో పాటు విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో సమావేశమయ్యారు. జిల్లాలోనే అత్యధి కంగా అడ్మిషన్లు తీసుకొ చ్చేందుకు కృషి చేసిన ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యా యులను డీఈవో అభినందించి సన్మానించారు. ప్రభుత్వ పాఠశాలపై నమ్మకం ఉంచి విద్యార్థులను బడిలో చేర్పిన తల్లిదండ్రులను ప్రశంసించారు. బెగ్లూర్ గ్రామాన్ని దత్తత తీసుకుని పాఠశాలకు మౌలిక సౌకర్యాలను కల్పిం చేందుకు కృషిచేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీఎంవో రమేష్, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు పురుషోత్తం రెడ్డి, సీఆర్పీ రాజయ్య, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ జ్యోతి, బెగ్లూర్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రామ్మూర్తి, ఉపాధ్యాయులు సాయి, శ్రీకాంత్, పూర్ణచందర్, త్రివేణి, లక్ష్మి, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

సంఘాలలో మహిళలను చేర్పించాలి : డీపీఎం

మొగుళ్లపల్లి, జూలై 8 (ఆంధ్రజ్యోతి): స్వయం సహాయక సంఘాల్లో లేని మహిళలను సర్వేచేసి నూతనంగా చేర్పించాలని డీపీఎం చౌహాన్ ఐకేపీ సిబ్బందికి సూచించారు. ఇందిరా మహిళాశక్తి సంబరాల్లో భాగంగా మంగళవారం స్థానిక వెలుగు మండల సమాఖ్య కార్యాలయంలో అధ్యక్షురాలు రమాదేవి అధ్యక్షతన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. చౌహాన్ మాట్లాడుతూ మహిళా శక్తి కార్యక్రమాల్లో భాగంగా ప్రతి గ్రామంలో గ్రామస్థాయిలో ప్రత్యేక సమావేశం నిర్వహించి సంఘాలలోలేని వారిని సర్వేచేసి చేర్పించాలన్నారు. వృద్ధ మహిళలు, కిషోరబాలికలు, దివ్యాంగులను సంఘాలుగా ఏర్పాటు చేయడానికి కృషి చేయాలని సూచించారు.అంతకుముందు డాక్టర్ సంధ్య ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మహిళలకు రక్తపరీక్షలు చేశారు. ఈ సమావేశంలో ఏపీఎం అంబాల రవివర్మ, మండల కార్యదర్శి రెల్ల సునీత, కోశాధికారి బత్తిని శిరీష, సీసీలు శ్రీనివాస్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

‘ఓపెన్’ విద్యను సద్వినియోగం చేసుకోవాలి

చిట్యాల : చదువు మానేసిన మహిళలు ఓపెన్ టెన్త్, ఇంటర్ విద్యను సద్వినియోగం చేసుకోవాలని ఐకేపీ డీపీఎం గోవింద్‌చౌహాన్, ఎంఈవో కోడెపాక రఘుపతి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఇందిరా మహిళా శక్తి సంబరాలు కార్యక్రమం నిర్వహించారు. ఓపెన్ స్కూల్ కరపత్రాన్ని ఆవిష్కరించారు.మహిళా సంఘాల్లో పదవ తరగతి, ఇంటర్మీడియట్ పూర్తి చేయని మహిళలను గుర్తించి అందుబాటులోని ఓపెన్ స్కూల్ సెంటర్లలో చేర్పించాలన్నారు. కార్యక్రమంలో ఏపీఎం మంజూల, కాంప్లెక్స్ హెచ్‌ఎంలు ఊర్మిళాదేవి, ఝాన్సీరాణి, మండల సమాఖ్య అధ్యక్షురాలు కొక్కుల ఉమ, సీసీలు పద్మావతి, సాంబశివుడు, రమణాదేవి, లలిత, సీఆర్పీలు తిరుపతి, అజ్మీరా రాజు, దూడపాక రాజు, వీవోఏలు పాల్గొన్నారు.

అందుబాటులో కంది, మినుముల విత్తనాలు

కాటారం, జూలై 8(ఆంధ్రజ్యోతి):జిల్లాలోని మహదేవపూర్, భూపాలపల్లి డివిజన్ల పరిధిలోని మండలాల రైతుల కోసం వ్యవసాయ శాఖ ద్వారా కంది, మినుముల విత్తనాలు అందుబాటులో ఉన్నాయని ఇన్‌చార్జి డీఏవో, టెక్నికల్ ఏడీఏ బాపురావు, మహదేవపూర్ ఏడీఏ శ్రీపాల్ తెలిపారు. మంగళవారం వారు కాటారంలో మాట్లాడుతూ పంటల మార్పిడి కోసం ఎన్‌ఎఫ్‌ఎస్‌ఎం (నేషనల్ ఫుడ్ సెక్యూరిటీ మిషన్) ఖరీఫ్-2025 కింద ఎల్‌ఆర్‌జీ-52 రకం కందులు, వీబీఎన్-8రకం మినుమలు విత్తనాలు వచ్చాయన్నారు. ఒక్కో డివిజన్ పరిధిలో 2క్వింటాళ్ల కందులు, 2క్వింటాళ్ల మినుములు విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, రైతులు పట్టాదారు పుస్తకాలు, ఆధార్‌కార్డులతో ఆయా ఏవో కార్యాలయాల్లో సంప్రదించి తీసుకోవాలని సూచించారు.

విద్యుత్ ఉద్యోగుల సమ్మె పోస్టర్ ఆవిష్కరణ

గణపురం, జూలై 8(ఆంధ్రజ్యోతి): కాకతీయ థర్మల్ పవర్ ప్రాజెక్టు విద్యుత్ ఆర్టిజన్ కార్మికులు మంగళవారం ప్రధాన ముఖద్వారం ఎదుట గేట్ మీటింగ్ నిర్వహించారు. కేటీపీపీ జేఏసి చైర్మన్ చిలువేరు అధ్యక్షతన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఈ నెల 14న విద్యుత్ ఆర్టిజన్ కార్మికులు చేపట్టబోయే సమ్మె పోస్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు రాజు, కుమార్, కృష్ణమూర్తి, శ్రీనివాస్, ప్రవీణ్, మధుకర్, సంపత్, రవి, అనిల్, బాలరాజు, మహిళా ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులోకి వయోజన విద్య

అడిషనల్ కలెక్టర్ విజయలక్ష్మి

భూపాలపల్లిటౌన్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వయోజన విద్య అందుబాటులో ఉందని అడిషనల్ కలెక్టర్ విజయలక్ష్మి తెలిపారు. తెలంగాణ ఓపెన్‌స్కూల్ వ్యవస్థతో ప్రతి ఒక్కరు విద్యలో ముందుకు వెళ్లొచ్చని, వయోజనుల కోసం ఉల్లాస్ అనే కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. డీఈవో రాజేందర్ అధ్యక్షతన డీఆర్‌డీఏ పీడీ బాలకృష్ణ సమన్వయంతో ఉల్లాస్ కార్యక్రమంపై మంగళవారం సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో ఉన్న వయోజనుల అక్షరాస్యత శాతం పెంచేందుకు ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళిక రూపొందించిందని తెలిపారు. ప్రధానంగా గ్రామీణ ప్రాంత బాలికలు, పురుషులు, మహిళలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు ఇతరులకు ఈ విద్యను అందించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని ముందుకు తీసుకువెళ్లనున్నట్లు తెలిపారు. అలాగే ఓపెన్‌స్కూల్ ద్వారా పదో తరగతితో పాటు ఇంటర్మీడియట్ పూర్తి చేయొచ్చని తెలిపారు. ఇది విద్యార్థులకు, యువతీ యువకులకు ఎంతో మేలు చేస్తుందని అన్నారు. వయోజన విద్య కోఆర్డినేటర్ వేణుగో పాల్, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, సీఆర్‌పీలు, డీఆర్‌డీఏ ఏపీఎంలు పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలి

కాటారం, జూలై 8(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ బుధవారం చేపడుతున్న ఒకరోజు సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని తెలంగాణ ప్రజాఫ్రంట్ జిల్లా అధ్యక్షుడు పీక కిరణ్ మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. 44 న్యాయమైన కార్మిక చట్టాలకు తూట్లు పొడిచిన కేంద్రం 4 కోడ్‌లుగా విభజించి కార్మికలోకానికి అన్యాయం చేస్తోందని విమర్శించారు.

డీడబ్ల్యూవోపై కమిషనర్‌కు ఫిర్యాదు

కృష్ణకాలనీ, జూలై 8 (ఆంధ్రజ్యోతి): సంక్షేమ శాఖ జిల్లా ఇన్‌చార్జి అధికారిపై ఆ శాఖ కమిషనర్‌కు ఫిర్యాదు చేసినట్లు సామాజిక కార్యకర్త ఎం.సంతోష్ మంగళవారం తెలిపారు. తనిఖీల పేరుతో అంగన్‌వాడీ టీచర్ల నుంచి రూ.2 వేల చొప్పున వసూలు చేస్తూ సిబ్బందిని ఇబ్బందులు పెడుతున్నారని ఆరోపించారు.

ఆశ్రమ పాఠశాలను తనిఖీ చేసిన ఐటీడీఏ పీవో

కాటారం, జూలై8(ఆంధ్రజ్యోతి): మండలంలోని మేడిపల్లి గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలను ఏటూరునాగారం ఐటీడీఏ పీవో చిత్రామిశ్రా మంగళవారం తనిఖీ చేశారు. పాఠశాల పరిసరాలను, తరగతిగదులను, డైనింగ్ హాల్, వంట గదిని పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యల గురించి తెలుసుకున్నారు. పాఠశాలలో జరుగుతున్న మరమ్మతు పనులను త్వరితగతిన పూర్తిచేసి విద్యార్థులకు ఇబ్బంది కలగకుండా చర్యలు చేపట్టాలని హెచ్‌ఎం చంద్రశేఖర్‌రెడ్డి, ఏఈ శ్రీనివాస్‌ను ఆదేశించారు. ఆమె వెంట ఐటీడీఏ డీడీ పోచం, పాఠశాల హెచ్‌ఎం చంద్రశేఖర్‌రెడ్డి, ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

ఆయిల్‌పామ్‌ను విస్తరించాలి

సమీక్ష సమావేశంలో కలెక్టర్ దివాకర



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ దివాకర

ములుగు కలెక్టరేట్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఆయిల్ పామ్ విస్తరణ లక్ష్యాలను పూర్తి చేయాలని కలెక్టర్ టీఎస్.దివా కర అధికారులకు సూచించారు. రైతులకు ఆయిల్‌పా మ్ సాగు, లాభాలపై అవగాహన కల్పించాలన్నారు. మంగళ వారం కలెక్టర్ తన చాంబర్‌లో అదనపు కలెక్టర్ సీహెచ్.మహేందర్‌జీతో కలిసి ఆయల్‌పామ్ సాగు విస్తీర్ణం, ప్రాసెసింగ్ ఇండస్ట్రీ నిర్మాణంపై సమీక్ష సమావేశం నిర్వహిం చారు. ఈసంద ర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ హార్టీకల్చర్ సహకార సంఘాల బలోపేతం, రైతుల సౌకర్యార్థం అనేక పథకాలు ప్రవేశ పెడుతుందని అన్నారు. పంట మార్పిడి ద్వారా ఆయిల్‌పామ్ పంటసాగుపై రైతులకు అవగాహన కల్పిం చాలని, క్షేత్రస్థాయిలో సంబంధితశాఖ అవగాహన సదస్సులు, ప్రచారం నిర్వహించాలని సూచించారు. పామాయిల్ పంట సాగుద్వారా రైతులకు అనేక లాభాలు చేకూరుతాయని, ప్రభుత్వం కల్పించిన సబ్సిడీ, రాయి తీల వివరాలను తెలియపరచాలన్నారు. జిల్లాకు కేటాయించిన ఆయిల్‌పామ్ విస్తీర్ణ లక్ష్యం 3000 ఎకరాలు సాధించడానికి వ్యవసాయశాఖ, ఉద్యాన శాఖ అధికారులు కలిసి ఒక నిర్దిష్ట ప్రణాళికలు తయారుచేసి ఈ మొదటి సీజన్‌లోనే 75 శాతం లక్ష్యాన్ని సాధించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా ఉద్యాన, పట్టుపరిశ్రమ అధికారి డి.సంజీవరావు, జిల్లా వ్యవసాయ అధి కారి సురేష్‌కుమార్, జిల్లా ఇండస్ట్రీస్ అధికారి సిద్ధార్థరెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ వెంకటసతీష్, విద్యుత్‌శాఖ డీఈ నాగేశ్వర్‌రావు, బయోసైన్స్ ఏరియా మేనేజర్ హేమంత్ కుమార్‌రెడ్డి, మైక్రో ఇరిగేషన్ ఇంజనీర్ వినోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వైఎస్ జయంతి





ములుగులో వైఎస్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి సీతక్క, భూపాలపల్లిలో వైఎస్ జయంతిలో ఎమ్మెల్యే గండ్ర

ములుగు టౌన్, జూలై 8(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ దివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖరరెడ్డి జయంతిని ములుగులో మంగళవారం ఘనంగా నిర్వహించారు. క్యాంపు కార్యాలయంలో మంత్రి ధనసరి సీతక్క పాల్గొన్నారు. వైఎస్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రేగా కల్యాణి, పార్టీ పట్టణ అధ్యక్షుడు చింతనిప్పుల భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

• భూపాలపల్లిటౌన్ (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో వైఎస్సార్ జయంతి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం భారీ కేక్ కట్‌చేసి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలకు పంపిణీ చేశారు. చల్లూరి మధు, బుర్ర కొమరయ్య, ఇస్లావత్ దేవన్, దాట్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

• ఏటూరునాగారం (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని బస్టాండ్‌లో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చిటమట రఘు ఆధ్వర్యంలో దివంగనేత వైఎస్ రాజశేఖరెడ్డి జయంతి వేడుకలను నిర్వహించారు. రాష్ట్ర రోడ్డు రవాణా శాఖ డైరెక్టర్ వసంత శ్రీని వాస్, కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి గుడ్ల దేవేందర్, జిల్లా ఉపాధ్యక్షుడు ఎమ్డీ. ఖలీల్ ఖాన్, జిల్లా అధికార ప్రతినిధి ముక్కెర లాలయ్య, మండల ప్రధాన కార్యదర్శి వావిలాల చిన్నఎల్లయ్య, పీఏసీఎస్ డైరెక్టర్ వంగపండ్ల రవి యాదవ్, టౌన్ అధ్యక్షుడు సరికొప్పుల శ్రీనివాస్, జిల్లా యూత్ కార్యదర్శి ఎమ్డీ. గౌస్ పాల్గొన్నారు.

• గోవిందరావుపేట (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో వైఎస్.రాజశేఖరరెడ్డి జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. వైఎ స్సార్ చిత్రపటానికి కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పాలడుగు వెంకటకృష్ణ పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్మిక శాఖ జిల్లా అధ్యక్షుడు కొంపెల్లి శ్రీనివాసరెడ్డి,నాయకులు జెట్టి సోమయ్య, పన్నాల ఎల్లారెడ్డి, పెండెం శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

• మంగపేట (ఆంధ్రజ్యోతి): వైఎస్. రాజశేఖరరెడ్డి జయంతిని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మైల జయరామిరెడ్డి ఆధ్వర్యంలో మంగ పేటలో నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి, విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా, ఉమ్మడి జిల్లా, నియోజికవర్గం, బ్లాక్, మండల, గ్రామ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

సీత్లా భవాని మాతకు పూజలు

వెంకటాపూర్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇంచెంచెరువు ఎల్లి గ్రామంలో బంజార మహిళలు మంగళవారం తమ ఇష్టదైవమైన సీత్లాభవాని మాతకు పూజలు నిర్వహించారు. గ్రామంలో నూతనంగా సీత్లాభవాని మాత విగ్రహాన్ని ఏర్పాటు చేయగా మహిళలు దర్శించుకుని సంప్రదాయం ప్రకారం నైవేద్యం సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామస్తులు ఆయురారోగ్యాలతో ఉండాలి, పాడిపంటలు సమృద్ధిగా ఉండాలని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో బంజార పెద్దలు, మహిళలు, యువతులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

• తాడ్వాయి (ఆంధ్రజ్యోతి): మండలంలోని నార్లాపూర్‌లో బంజా రాలు సీత్లా పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా తండా పెద్దలు మాట్లాడుతూ వారి తెగలో ఆనవాయితీగా సీత్లా పండుగను కలిసి కట్టుగా జరుపుకుంటామని అన్నారు. పాడిపశు, పంటలు, అందరి ఆరోగ్యం మంచిగా ఉండి సిరిసంపదలు కలగాలని దుర్గమ్మకు పూజలు చేసి దీప ధూప నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. భూక్య శ్రీను, గుజు రోత్ రతన్‌సింగ్, మాలోత్ లాల్‌సింగ్, బాదవత్ గోపి, నూనావత్ కోటి, జాటోత్ బాలాజీ, యాకు, సురేష్, దేవ్‌సింగ్, రాజేష్, బాలరాజు, నాగేష్, మెహన్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలకు వ్యాన్ సౌకర్యం కల్పించాలి

కలెక్టరేట్ ఎదుట జేఏసీ ధర్నా

భూపాలపల్లిటౌన్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలకు వ్యాన్ సౌకర్యం కల్పించాల ని డిమాండ్ చేస్తూ తెలంగాణ బీసీ, ఎస్సీ, ఎస్టీ, రైట్స్ అండ్ రాజ్యాధికార సాధన జేఏసీ ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా భూపాలపల్లి జిల్లా జేఏసీ కోఆర్డినేటర్ కొత్తూరి రవీందర్‌మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం లో 26 వేలకు పైగా ప్రభుత్వ పాఠశాలలు ఉన్నా యని అన్నారు. వాటిలో సుమారు 22లక్షల మంది విద్యార్థులు చదువుకుంటున్నారని తెలిపారు. వీరిలో 90 శాతం మంది విద్యార్థులు దూర ప్రాంతాల నుంచి వచ్చి చదువుకుం టున్నవారేనని తెలిపారు. వర్షం పడితే విద్యార్థులు పాఠశాలకు వెళ్లలేని దుస్థితి దాపురించిందని అన్నారు. ప్రతి 30మంది విద్యార్థులకూ ఒక బస్సు చొప్పున పాఠశా లలకు నడిపించాలని డిమాండ్ చేశారు. ఈ కార్య క్రమం లో బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు భీమనాథుని సత్యానారాయణ, రజక సంఘం నాయకుడు వైనాల శోభన్, శంకర్, సంతోష్ ముదిరాజ్, రవికుమార్, ధర్మ స్టూడెంట్ యూనియన్ జిల్లా కన్వీనర్ దూడపాక శ్రీకృష్ణ, జేఏసీ నాయకులు మంద రమేష్, కండె రవి, మహర్షి, అశోక్, స్వామినాథన్, కుమార్, భాస్కర్, రవి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న జేఏసీ నాయకులు

సమ్మెకు సంఘీభావ ర్యాలీ

భూపాలపల్లిటౌన్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 9న జరిగే దేశవ్యాప్త సార్వ త్రిక సమ్మెకు మద్దతుగా నిలుస్తూ ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో ర్యాలీ, ధర్నా కార్యక్రమాలు జరిగాయి. భూపా లపల్లి పట్టణంలోని గణేష్ చౌరస్తా నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు బానోతు సేవానాయక్, డీటీ ఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అశోక్, తిరుపతి, సింగరేణి ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కామెర గట్టయ్య, ఏఐఎఫ్‌యూ జిల్లా నాయకుడు శంకర్, ఎంఈ ఎఫ్ జాతీయ నాయకుడు మొలుగూరి మొగిలయ్య, తెలంగాణ ప్రజాఫ్రంట్ జిల్లా నాయకుడు కిరణ్, తదితరులు పాలొన్నారు.